శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం

తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం ఉదయం దీపావళి ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ అర్చకులు, జీయంగార్లు, టీటీడీ ఉన్నతాధికారుల సమక్షంలో బంగారువాకిలి చెంత ఆగమోక్తంగా ఆస్థాన వేడుకను నిర్వహించారు. ముందుగా ఆలయంలో మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన పట్టువస్త్రాలు సమర్పించి రూపాయి హారతి, ప్రత్యేక హారతులను నివేదించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు సహస్రదీపాలంకరణ సేవలో పాల్గొని మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ ఈవో శ్యామలరావు , అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి







టపాసులు కాల్చి.. నోములు నోచి

దీపావళి సందర్భంగా గురు, శుక్రవారాల్లో టపాసులు కాల్చారు. జిల్లాలో టపాసుల మోతెక్కింది. ఇలా టపాసులు కాల్చే క్రమంలో ఇనుప రేకు మెడకు గుచ్చుకోవడంతో పుత్తూరు మండలం గోపాలకృష్ణపురం ఎస్టీ కాలనీకి చెందిన చరణ్(14) మృతిచెందాడు. ఇక, శ్రీకాళహస్తితో పాటు అమ్మవారి ఆలయాల్లో కేదారి గౌరీదేవి వ్రతాన్ని నిర్వహించారు. - 6లో

టీటీడీ బోర్డులో భానుకు దక్కిన చోటు

- తుడా ఛైర్‌పర్సన్‌కు ఎక్స్ అఫిషియో సభ్యత్వం
- ప్రత్యేక ఆహ్వానితుల నియామకానికి అవకాశం
- బీజేపీ కోటా ఓకే.. సజీవంగా టీడీపీ నేతల ఆశలు



తిరుపతి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డులో తిరుపతికి చెందిన బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డికి చోటు దక్కింది. తొలుత ఖరారైన జాబితాలో 25 మందికి గానూ ఛైర్మన్, 23 మంది సభ్యులతో కలిపి 24 పేర్లే వుండగా.. శుక్రవారం వెలువడిన జీవోలో 24వ సభ్యుడిగా జి.భానుప్రకాష్‌రెడ్డిని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా తరచూ పార్టీ గొంతుకను బలంగా వినిపించిన ఈయనకు తగిన గుర్తింపు, గౌరవం దక్కింది. హిందూ ధర్మ పరిరక్షణతో పాటు టీటీడీ ప్రయోజనాల కోసం ఆయన చెప్పుకోదగ్గ పోరాటం చేశారు. టీటీడీ నిధులను ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు మళ్ళించడాన్ని వ్యతిరేకించారు. వకుళమాత ఆలయ స్థలాన్ని పరిరక్షించడంలో.. అలిపిరి వద్ద గోపూజ మందిరం ఏర్పాటు వెనుకా ఆయన కృషి వుంది. వైసీపీ హయాంలో నేరచరిత్ర కలిగిన వారిని టీటీడీ సభ్యులుగా నియమించడాన్ని, తిరుపతి అభివృద్ధికి టీటీడీ నుంచి రూ. వంద కోట్లు కేటాయించడాన్ని వ్యతిరేకించారు. ఈ అంశాలపై హైకోర్టులో న్యాయపోరాటం సాగించారు. ఓ దశలో అప్పటి అధికారులు ఆయనకు శ్రీవారి దర్శనాలు సైతం నిలిపివేసి వేధించారు. 2015-17 నడుమ రెండేళ్ళ పాటు టీటీడీ పాలకమండలి సభ్యుడుగా పనిచేసిన భానుప్రకాష్‌రెడ్డికి దేవస్థానం వ్యవహారాలపై లోతైన అవగాహన వుంది. బీజేపీలో ఉన్నత స్థాయి నేతలతో ఉన్న సన్నిహిత సంబంధాలు ఆయనకు అనుకూలంగా మారింది. బీజేపీ కోటాలో బోర్డు మెంబరు కోసం తీవ్ర పోటీ నెలకొనగా చివరకు భానుప్రకాష్‌రెడ్డికి దక్కింది.

తుడా ఛైర్మన్‌కు ఎక్స్‌అఫిషియో హోదా

టీటీడీ బోర్డులో తిరుపతికి చెందిన నేతలకు అవకాశం దక్కలేదు. అయితే తుడా ఛైర్మన్‌కు ఎక్స్ అఫిషియో సభ్యత్వం కల్పించడంతో ఇక్కడి నేతల ఆశలను సజీవంగా ఉంచుతోంది. గతంలో ఎప్పుడూ టీడీపీ ప్రభుత్వం తుడా ఛైర్మన్‌కు టీటీడీలో సభ్యత్వం కల్పించిన దాఖలాలు లేవు.అయితేతాజా జీవోలో ఎక్స్ అఫిషియో సభ్యత్వం కల్పించడంతో తుడా ఛైర్మన్ పదవికి క్రేజ్ పెరిగింది.దీంతో ఇపుడు తిరుపతికి చెందిన ముఖ్య నేతల దృష్టి తుడా ఛైర్మన్ పదవిపై మళ్లింది. ఇక, ప్రత్యేక ఆహ్వానితుల ప్రస్తావన జీవోలో లేకపోయినా,తదుపరి ఎప్పుడైనా ప్రభుత్వం ఇద్దరు లేదా ముగ్గురిని నియమించే అవకాశముంది.ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాదు వంటి ఇతర ముఖ్య నగరాల్లోని ఆరు లోకల్ అడ్వైజరీ కమిటీల అధ్యక్షులను కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించే అవకాశమూ వుంది. ఆ కోటాలో తిరుపతి వారికి అవకాశం వుండదు కాబట్టి ప్రత్యేక ఆహ్వానితుల పదవులపైనే స్థానిక నేతలు ఆశపడుతున్నారు.

తిరుపతి ఎమ్మెల్యేకు అవకాశంపై అనిశ్చితి

తిరుపతి ఎమ్మెల్యేకి టీటీడీ ధర్మకర్తల మండలిలో ప్రత్యేక ఆహ్వానితుడి హోదా దక్కుతుందా లేదా అన్నదానిపై అనిశ్చితి కొనసాగుతోంది. కాంగ్రెస్ హయాంలో చిరంజీవికి.. వైసీపీ ప్రభుత్వం అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డికి ఆ హోదా కల్పించింది. టీడీపీ ప్రభుత్వం గతంలో ఎప్పుడూ ఈ హోదా ఇవ్వలేదు. దీంతో తాజా బోర్డులో ఆ హోదా ఇస్తారా ఇవ్వరా అన్నదానిపై స్పష్టత రాలేదు.

ఉచిత సిలిండర్ల పంపిణీ ప్రారంభం



లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

తిరుపతి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపం-2 పథకం కింద ఉచిత సిలిండర్ల పంపిణీకి శుక్రవారం జిల్లాయంత్రాంగం శ్రీకారం చుట్టింది. తడ మండలం రామాపురంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఆర్డీవో కిరణ్మయి తదితరులు ఉచిత సిలిండర్లు పంపిణీ చేశారు. మిగతా నియోజకవర్గాల్లోనూ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి పార్టీల నేతలు పాల్గొని ఉచిత సిలిండర్లు పంపిణీ చేశారు. ఈ ఉచిత సిలిండర్ల ప్రభావంతో బుకింగ్ రెట్టింపైంది. జిల్లాలో 62 ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 4,92,302 గ్యాస్ కనెక్షన్లు వుండగా రేషన్ కార్డులు 6,00,350 వున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో రోజువారీ 300 నుంచీ 350 వరకూ సిలిండర్లు బుక్ అయ్యేవి. ప్రభుత్వం మొదటి ఉచిత సిలిండర్ ప్రకటన జారీ చేయడంతో రెట్టింపు సంఖ్యలో సిలిండర్లు బుక్ అవుతున్నాయి. 29, 30, 31 తేదీల్లో రెండు వేలకుపైగా సిలిండర్లు బుక్ అయ్యాయి. రోజువారీ 600కు మించి సిలిండర్లు బుక్ అవుతున్నాయని గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు చెబుతున్నారు. మొదటి ఉచిత సిలిండర్‌కు అర్హులైన వారు సిలిండరు అందుకున్న రెండు రోజుల్లోపే వారి ఖాతాలకు ప్రభుత్వం వంట గ్యాస్ ధర మొత్తాన్ని జమ చేయనుంది.



తిరుచానూరులో వితంతుపింఛను పంపిణీ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

సర్వర్ మొరాయించినా..!

- జిల్లాలో 96.44 శాతం పింఛన్ల పంపిణీ
- రాష్ట్రంలో మూడో స్థానం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణ శుక్రవారం ఉదయం 6గంటలకు ప్రారంభమైంది. అయితే 8.30 గంటలకు సర్వర్‌లో సాంకేతిక సమస్య మొదలవగా, దాదాపు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పరిష్కారమైంది. దీంతో యథావిధిగా సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేశారు. ఒక వైపు దీపావళి.. మరోవైపు సర్వర్ మొరాయించినా సాయంత్రానికి 2,56,029మందికి (96.44 శాతం) పింఛన్లను పంపిణీ చేశారు. రాష్ట్రంలో తిరుపతి జిల్లా మూడో స్థానం దక్కించుకుంది. దాదాపు రూ.108.33 కోట్ల పింఛన్లను పంపిణీ చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మిగిలిన మూడు శాతం శనివారం పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. ఈ పింఛన్ల పంపిణీలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అయ్యాఎస్ అనకపోతే ట్రాన్స్‌ఫర్ చేయిస్తా!



- ఐఏఎస్ అధికారికి కూటమి నేత దబాయింపు

జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లు అధికారుల మీద దబాయింపు పాలన చూసిన కొందరు కూటమి నేతలు, మేం మాత్రం తక్కువా అన్నట్టుగా అదే మార్గాన్ని అనుసరించే ప్రయత్నం చేస్తున్నారు. తిరుపతి నగరంలోని ఒక పార్టీ నాయకుడు ఏకంగా ఐఏఎస్ అధికారి అయిన కార్పొరేషన్ కమిషనర్‌నే దబాయిస్తున్నాడనే ప్రచారం జరుగుతోంది. కాంట్రాక్ట్ వర్క్‌లు ఇవ్వండని అడగడమే గాక, తాను చెప్పిన వారిని బదిలీ చేయాలంటూ అడిగినట్లు తెలిసింది. అంతటితో సరిపెట్టుకోకుండా 'నాకు కార్పొరేషన్ ఆఫీస్‌లో ఛాంబర్ ఏర్పాటు చేయండి' అని కూడా ఆదేశించారని తెలియడంతో అందరూ నివ్వెర పోయినట్లు సమాచారం. పార్టీ నాయకులకు ఛాంబర్లు ఇవ్వడం కుదరదని అధికారి స్పష్టం చేయడంతో, చిర్రెత్తిపోయిన ఆ నాయకుడు ఆమె మీద ఇటీవల తిరుపతికి వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఫిర్యాదు చేశారు. అ ఆధికారి పెళ్లికి అప్పట్లో జగన్మోహన్ రెడ్డి హాజరైన ఫొటోలను మంత్రికి చూపించి, ఆమె మన పార్టీకి వ్యతిరేకం అంటూ ఆమెను బదిలీ చేసేయాలని కూడా కోరడం విశేషం. జగన్ ప్రభుత్వంలో కొందరు కమిషనర్లు వైసీపీ నాయకులకు అయ్యాఎస్‌ల్లా వ్యవహరించిన తీరు అందరికీ తెలిసిందే. ప్రస్తుత తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఎన్.మౌర్య మాత్రం ఐఏఎస్ అధికారిగా వ్యవహరిస్తున్నారన్న పేరుంది. తాము అడిగే గొంతెమ్మ కోర్కెలన్నింటినీ తీర్చకపోవడంతో కొందరు నాయకులు ఉడికిపోతున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఆ చిన్నారి ఏమైంది?

వడమాలపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆ మూడున్నరేళ్ల చిన్నారి శుక్రవారం సాయంత్రం వరకు ఆడుతూ పాడుతూ కనిపించింది. ఆ తర్వాత నుంచి కనిపించలేదు. వడమాలపేట మండలంలోని యానాది కాలనీకి చెందిన ఈ చిన్నారి కనిపించడం లేదంటూ తల్లిదండ్రులు శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలనీకి చెందిన నాగరాజుపై అనుమానం వ్యక్తంచేశారు. ఆ చిన్నారికి చాక్లెట్లు కొనిస్తానంటూ తీసుకెళ్లాడని సాయంత్రం తీసుకెళ్లాడని అంటున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు చిన్నారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, ఆ చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడి.. హతమార్చాడని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో పోలీసులు మాత్రం ఎలాంటి స్పష్టతనివ్వడం లేదు.

కార్తీక సోమవారాల్లో ఆర్టీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీ

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసంలో వచ్చే సోమవారాలను పురస్కరించుకొని ఆర్టీసీ జిల్లా యంత్రాంగం ఒక్కరోజు ప్రత్యేక టూర్ ప్యాకేజీని ఏర్పాటు చేశారు. తిరుపతి డిపో పరిధిలోని నూతన అల్ట్రాడీలెక్స్ సర్వీస్‌ను ఎంపిక చేశారు. కార్తీకమాసం ప్రతి సోమవారాల్లో ఉదయం 6గంటలకు సీబీఎస్‌లోని ఏడుకొండల బస్టాండు నుంచి బయలుదేరి శ్రీనివాసమంగాపురం, తొండవాడ, అప్పలాయగుంట, నారాయణవనం, కైలాసనాధకోన, నాగలాపురం, సురుటుపల్లి పుణ్యక్షేత్రాలను సందర్శించి తిరిగి సాయంత్రం తిరుపతికి చేరుకుంటుంది. టిక్కెట్ ధరలు పెద్దలకు రూ. 400, పిల్లలకు రూ. 280 నిర్ణయించి ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కల్పించినట్లు తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ పేర్కొన్నారు.

రైల్వే ప్రాజెక్టులపై 4న పార్లమెంటరీ కమిటీ సమావేశం

తిరుపతి(కలెక్టరేట్/సెంట్రల్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైల్వేశాఖపై ఆన్ ది స్పాట్ స్టడీ టూర్ నిమిత్తం రెండు రోజుల పర్యటన నిమిత్తం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆదివారం రానుంది. సోమవారం ఉదయం దక్షిణ మధ్య రైల్వే జీఎం, అధికారులతో రైల్వేస్టేషన్ల మౌలిక వసతి సదుపాయాల కల్పనపై సమీక్షిస్తారు. మధ్యాహ్నం 3గంటలకు తిరుపతి రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులతో సమీక్షిస్తారు. తిరిగి రాత్రి 7.45 ఢిల్లీకి తిరుగుపయనం అవుతారు.

2 రోజుల శ్రీవారి హుండీ ఆదాయం రూ.7.03 కోట్లు

తిరుమల, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రెండు రోజుల్లో రూ.7.03 కోట్లు లభించింది. మంగళ, బుధవారాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధ, గురువారాల్లో లెక్కించింది. ఈమేరకు రూ.7.03 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ ప్రకటించింది. ఇక, బుధవారం 55,219 మంది, గురువారం 63,987 భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే ఈ రెండురోజుల్లో 37,113 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

సెట్విన్ సీఈవో బదిలీ

తిరుపతి అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సెట్విన్ సీఈవో మురళీకృష్ణను బదిలీ చేస్తూ యువజన సర్వీసులశాఖ కార్యదర్శి వినయ్‌చంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పశుసంవర్థశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ విధులు నిర్వహిస్తున్న ఆయన్ను 2019 అక్టోబరు 3న డిప్యూటేషన్‌పై అప్పటి వైసీపీ ప్రభుత్వం ఉమ్మడిజిల్లా సెట్విన్ సీఈవోగా నియమించింది. అప్పటి నుంచి డిప్యుటేషన్‌ను పొడిగిస్తూ ఐదేళ్లుగా ఇదే పోస్టులో కొనసాగారు. ఎట్టకేలకు మాతృసంస్థకు బదిలీ చేస్తే కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తదుపరి ఉత్తర్వులు వెలువడేవరకు ప్రత్యామ్నాయంగా మరొక అధికారిని భర్తీచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సూచించారు.

మేము ఖాళీ చేయమంతే..!

● అధికారులతో రుయాలో దుకాణ ఆక్రమణదారుల వాగ్వాదం

తిరుపతి(వైద్యం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'మేము ఖాళీ చేయం. ఖాళీ చేయమనడానికి మీరెవరు?' అంటూ రుయాస్పత్రిలో దుకాణాన్ని ఆక్రమించిన వారు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రుయాస్పత్రిలో ఖాళీగా ఉన్న ఓ దుకాణాన్ని జనసేన నేత అండతో ఇటీవల ఆక్రమించి అందులో వ్యాపారం సాగిస్తున్నారు. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో ఆ దుకాణాన్ని స్వాధీనం చేసుకొని ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టరు వెంకటేశ్వర్ రుయా సూపరింటెండెంట్ రవిప్రభును ఆదేశించారు. దీంతో ఆయన షాపును ఖాళీ చేయాలని దుకాణదారులను ఆయన ఆదేశించారు. అయినా, ఖాళీ చేయలేదు. దీంతో ఇన్‌చార్జి సీఎస్ఆర్ఎంవో శ్రీనివాస్, ఏఆర్ఎంవో హరికృష్ణ సిబ్బందితో కలిసి శుక్రవారం ఆక్రమణకు గురైన దుకాణం వద్దకు చేరుకొని వెంటనే ఖాళీ చేయాలని సూచించారు. తాము ఖాళీ చేసేది లేదని, తమ దుకాణాన్ని ఖాళీ చేయమని చెప్పేందుకు మీరెవరంటూ ఆక్రమణదారులు అధికారులతో వాదనకు దిగారు. వీరికి కొందరు జనసేన నేతలు మద్దతుగా నిలిచారు. పక్కనే ఉన్న పోలీస్ అవుట్‌పోస్టులోని పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది అక్కడకు వచ్చి వారిని అడ్డుకున్నారు. అధికారులు ఎంత చెప్పినా ఆక్రమణదారులు దుకాణాన్ని ఖాళీ చేయలేదు. శనివారం మధ్యాహ్నం లోపు దుకాణాన్ని ఖాళీ చేయకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించి వెళ్లారు.



అధికారులతో వాగ్వాదానికి దిగిన ఆక్రమణదారులు

మొదటి ఘాట్‌లో ఉడుము

తిరుమల ఘాట్‌లో ఓ ఉడుము రోడ్డు దాటుతున్న వీడియో ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. మాల్వాడి గుండం వద్ద ఉడుము రోడ్డు దాటుతుండటాన్ని గుర్తుతెలియని వ్యక్తులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఆ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



నేడు మండల సమావేశం

పాకాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాకాల మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ లోకనాథం అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శశిరేఖ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

తిరుచ్చిపై సిరుల తల్లి అభయం

తిరుచానూరు, నవంబరు 1 (ఆంధ్ర జ్యోతి): తిరుచానూరులో కొలువైన పద్మావతిదేవికి శుక్రవారం రాత్రి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. వేకువ జామున సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొపి అర్చకులు నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ నిర్వహించారు. మధ్యాహ్నం ఫ్లైడే గార్డెన్‌లో ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా తిరుమంజనం చేశారు. అలంకార శోభితురాలైన పద్మావతి దేవి బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, అర్చకుడు బాబుస్వామి, సూపరింటెండెంట్లు ప్రసన్న కుమార్, రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుభాస్కర్ నాయుడు పాల్గొన్నారు.



తిరుచ్చిపై పద్మావతి అమ్మవారు

ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

ప్రారంభించిన ఎమ్మెల్యే నాని, జేసీ బన్సల్

పాకాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామలచెరువులో శుక్రవారం ఎమ్మెల్యే పులివర్తి నాని, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని ప్రారంభించారు. పంచాయతీ కార్యాలయం వద్ద మహిళలకు సిలిండర్లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నాలుగు నెలలకొకటి చొప్పున ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందజేస్తారన్నారు. గ్యాస్ బుక్ చేసుకునే లబ్ధిదారులకు సొమ్ము వారి వ్యక్తిగత ఖాతాల్లో 48 గంటల్లో జమ అవుతుం దన్నారు. జేసీ మాట్లాడుతూ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఈకేవైసీ చేయించుకుని ఈ పథకంలో లబ్ధి పొందాలన్నారు. ఫిర్యాదులు వస్తే సంబంధిత గ్యాస్ ఏజెన్సీ, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్య లు వస్తే ఆయా సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలల్లో ఫిర్యాదు చేయాలని, స్పందించ కుంటే జేసీకి తెలియజేయాలని కోరారు. కార్య క్రమంలో డీఎస్‌వో శేషరాజు, తహసీల్దార్ నిత్యా నందబాబు, ఎంపీడీవో శశిరేఖ, ఎంపీపీ లోకనాథం, జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, సర్పంచ్ సునీత, టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజ నాయుడు, నాయకులు ఫల్గుణ, కె.సావిత్రి, రాజ్యలక్ష్మి, ఎల్.కోటి, చలపతినాయుడు, పురుషోత్తంనాయుడు, రఘునాథనాయుడు, లక్ష్మీపతి నాయుడు, చిన్నబ్బనాయుడు, వి.కుమారస్వామి నాయుడు, జనసేన నాయకులు నాసీర్, గురునాథ్ పాల్గొన్నారు.



దామలచెరువులో సిలిండర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నాని, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

చిన్నగొట్టిగల్లులో..

భాకరాపేట: మండల కేంద్రమైన చిన్నగొట్టిగల్లులో తహసీల్దారు జనార్దన్ రాజు లబ్ధిదారులకు ఉచిత సిలిండర్లు పంపిణీ చేశారు. యాక్టివ్ గ్యాస్ కనెక్షన్ కలిగిన, తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమం లో ఈవోపీఆర్డీ సోమశేఖర రెడ్డి, ఎంపీటీసీ విజయకుమారి, సర్పంచ్ మనోహర, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు రమేశ్, కార్యదర్శి మదనమోహన్ రాజు, టీడీపీ నేతలు మోహన్ రెడ్డి, చోటాసాహెబ్, బెల్లంకొండ రమణ, శేఖర్ గౌడ్, ఎర్రయ్య నాయుడు, రాజగోపాల్ నాయుడు పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ అలయ వీధిలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ, ఆర్టీసీ బస్టాండు వద్దనున్న ఇండియన గ్యాస్ ఏజెన్సీలలో ఉచిత సిలెండర్లు పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ శివసుబ్బ రామయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీఎం, డిప్యూటీ సీఎం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్‌ను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో శేఖర్, గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు బాలాజీ, జానకీ ప్రసాద్, ఉమాపతి పాల్గొన్నారు.

కుప్పం బాదూరులో..

రామచంద్రాపురం: మండలంలోని కుప్పం బాదూరులో రేణింతల హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. తహసీల్దారు వెంకటరమణతో కలిసి టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి ప్రా రంభించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ వచ్చే ఏడాది మార్చి ఒకటి లోపు ఉచిత సిలిండర్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. టీడీపీ నేతలు కేశవులునాయుడు, చిన్నబాబు, జనార్దన్ చౌదరి, నరసింహారెడ్డి, హరిప్రసాద్, ధనంజయులు, మహేష్ నాయుడు, సురేందర్ నాయుడు, కోటేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్, దినేష్‌నాయుడు పాల్గొన్నారు.

మద్యం మత్తులో లారీ డ్రైవర్ బీభత్సం

● వెంబడించి పట్టుకున్న యువకులు

రేణిగుంట, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో లారీ నడుపుతూ ఓ డ్రైవర్ రోడ్డుపై బీభత్సం సృష్టించాడు. ఆగ్రహించిన యువకులు వెంబడించి లారీ డ్రైవర్‌ను పట్టుకు న్నారు. స్థానికుల కథనం మేరకు.. పశుపతి ట్రాన్స్‌పోర్టుకు చెందిన ఓ డ్రైవర్ మినీలారీ తో రేణిగుంట వైపు బయలుదేరాడు. నారాయణాద్రి ఆస్పత్రి నుంచి విపరీతమైన వేగంతో డివైడర్లను రాసుకుంటూ, స్పీడ్ బ్రేకర్ల వద్ద నెమ్మదించకుండా ఇష్టం వచ్చినట్లు రోడ్డుకు అటుఇటు తిప్పుతూ నడపడంతో ముందు, వెనుక వెళుతున్న వాహనదారులు భయంతో తమ వాహనాలను రోడ్డు పక్కన ఆపేశారు. వెనుక వస్తున్న కొంతమంది వాహనదారులు లారీని ఓవర్ టేక్ చేసి ముందుపోతున్న వాహనదారులను అప్రమత్తం చేశారు. రేణిగుంట అంబేడ్కర్ కూడలి వద్ద ఆ లారీని ఆపి వాహన డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించారు.



లారీని రేణిగుంటలో ఆపేసిన యువకులు (ఇన్‌సెట్లో) మద్యం మత్తులో లారీ డ్రైవర్

రాష్ట్ర సరిహద్దులో కలకలం

● తమిళనాడు యువకుడికి పోస్టుమార్టం

● హత్యచేసిన వీడియోను షేర్‌చేసి దొరికిపోయిన హంతకులు

సత్యవేడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులోని సత్యవేడు మండలం చెన్నేరిలో తమిళనాడుకు చెందిన ఓ యువకుడిని హత్యచేసి పూడ్చి పెట్టిన ఘటన కలకలం రేగింది. రెండు నెలల అనంతరం ఆలస్యంగా వెలుగు చూసిన ఈ హత్యోదంతంతో రెండు రాష్ట్రాల్లోని సరిహద్దు ప్రాంతాలు ఉలిక్కి పడ్డాయి. వివరాలిలా ఉన్నాయి... రాష్ట్ర సరిహద్దులోని తమిళనాడు రాష్ట్రం ఊత్తుకోట్టైకు చెందిన ధనశేఖర్ కుమారుడు దినేష్ (20) ఈ ఏడాది ఆగస్టు 20వ తేదీన అదృశ్యమయ్యాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఊత్తుకోట్టై పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. రెండు నెలల నుంచి విచారణ చేస్తున్న ఊత్తుకోట్టై పోలీసులు సూళ్లూరుపేటకు చెందిన నాగేష్(21), ఊత్తుకోట్టైకు చెందిన కార్తీక్ (22)తో పాటు ముగ్గురు అనుమానితు లను అదుపులో తీసుకుని విచారించగా దినేష్‌ను హతమార్చి ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో పూడ్చిపెట్టినట్లు తేలింది. దీంతో తిరువళ్లూరు డీఎస్పీ శాంతి ఆదేశాల మేరకు ఊత్తుకోట్టై సీఐ దేవరాజ్ ఆధ్వర్యంలో మృతదేహాన్ని పూడ్చి పెట్టిన ప్రాంతాన్ని గుర్తించి వెలికి తీసేందుకు సత్యవేడు సీఐ మురళీని సంప్రదించారు. ఈ క్రమంలో సత్యవేడు తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎస్ఐ రామస్వామి సమక్షంలో తమిళనాడు పోలీసులు గురువారం చెన్నేరి వద్ద మృతదేహాన్ని పూడ్చి పెట్టిన ప్రాంతాన్ని గుర్తించి, శవాన్ని వెలికి తీశారు. ఇరు రాష్ట్రాలకు చెందిన పోలీసు, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో తమిళనాడుకు చెందిన వైద్య బృందంతో మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కేసులో మరో ప్రధాన నిందితుడైన కామేష్ (25) ఇప్పటికే వేరే కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్నట్లు తెలిసింది. కాగా ఈ నలుగురు యువకులు గంజాయి, మద్యం సేవించి మత్తులో ఈ హత్య చేసినట్లు సమాచారం. నిందితులు హత్యను వీడియో తీసి మద్యం మత్తులో ఇతర స్నేహితులకు చూపించడంతో విషయం బయటకు పొక్కింది.



మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న అధికారులు

13న శ్రీవారి ఆలయంలో కైశికద్వాదశి ఆస్థానం

తిరుమల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఈనెల 13న కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో టీటీడీ సాలకట్ల కైశిక ద్వాదశి ఆస్థానాన్ని ఘనంగా నిర్వహించనుంది. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి, భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధుల్లో ఊరేగిస్తారు. చారిత్రక వివరాలను పరిశీలిస్తే.. కైశిక ద్వాదశిని ప్రబోధనోత్సవం అని, ఉత్థానద్వాదశి అని కూడా వ్యవహరిస్తారు.స్థితికారుడైన మహావిష్ణువును మేల్కొల్పే పర్వదినాన్ని కైశిక ద్వాదశిగా వ్యవహరిస్తారు. మహావిష్ణువు ఆషాఢశుక్ల ఏకాదశిరోజున గాఢ నిద్రలోకి వెళ్లారు. కైశికద్వాదశి రోజున ఆయన్ను మేల్కొలపడం రివాజు. మహావిష్ణువు స్వరూపంగా భావించే వేంకటేశ్వరస్వామి కొలువైఉన్న శ్రీవారి ఆలయంలో కైశికద్వాదశి మహోత్సవాన్ని ఏటా టీటీడీ ఘనంగా నిర్వహిస్తోంది.14వ శతాబ్దంలో ఉగ్రశ్రీనివాసమూర్తి ఊరేగింపు జరుగుతుండగా సూర్యకిరణాలు స్వామివారి విగ్రహంపై పడగానే భారీ అగ్ని ప్రమాదం జరిగిందట. అప్పటి నుంచి సూర్యోదయానికి ముందే ఊరేగింపు నిర్వహిస్తారు. ఆ రోజు ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి, భూదేవి సమేతంగా సూర్యోదయానికి ముందే తెల్లవారుజామున ఆలయ అర్చకులు మాడవీదుల్లో ఊరేగిస్తారు. అనంతరం ఆలయంలోపల ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు కైశిక ద్వాదశి ఆస్థానాన్ని పురాణ పారాయణం ద్వారా ఘనంగా నిర్వహిస్తారు.

బంజారాలకు టీటీడీ బోర్డులో అవకాశమివ్వాలి

- తెలంగాణ ఎంపీ బలరాంనాయక్

తిరుమల, నవంబరు1(ఆంధ్రజ్యోతి):టీటీడీ బోర్డులో తెలంగాణ నుంచి ఐదుగురికి సభ్యులుగా అవకాశమిచ్చిన సీఎం చంద్రబాబుకు తెలంగాణ ఎంపీ బలరాంనాయక్ ధన్యవాదాలు చెప్పారు. అలాగే హథీరాంజీ మఠానికి బంజారా కమ్యూనిటీకి ప్రత్యేక అనుబంధం వున్న క్రమంలో రాబోయే రోజుల్లో బంజారా, లంబాడీ సోదరులకూ టీటీడీ బోర్డులో సభ్యులుగా అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు.హథీరాంజీ మఠం భూములకు రక్షణ లేకుండా పోయిందన్నారు. హైకోర్టు న్యాయమూర్తితో కమిషన్ ఏర్పాటు చేసి భూములకు రక్షణ కల్పించడంతో పాటు మఠాన్ని అభివృద్ధి చేయాలన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలు తిరుమలకు వస్తే బస చేసేది హథీరాం మఠంలోనే అన్నారు. ఈ క్రమంలో సీఎం మఠంలో సౌకర్యాల పెంపుపై దృష్టి సారించాలన్నారు.



భక్తి శ్రద్ధలతో కేదారి గౌరీవ్రతం

చంద్రగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో దీపావళి పండుగ సందర్భంగా శుక్రవారం కేదారి గౌరీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ, కన్యకాపరమేశ్వరి, శ్యామలాంబ సమేత మల్లేశ్వర, బజారు వీధిలోని సాయిబాబా, తొండవాడ స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరాలయాల్లో కేదారి గౌరీదేవి ప్రతిమను తయారు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వ్రతం చదివి వినిపించారు. మహిళలు పాల్గొని నోములు నోచుకున్నారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. మూలస్థాన ఎల్లమ్మ ఆలయ ఈవో మమత పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఇంటి ఆవరణలో గౌరీవ్రతం

చంద్రగిరి మండలంలోని నరసింగాపురం గ్రామంలో పుత్తూరు మాజీ ఎమ్మెల్యే రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డి ఇంటి ఆవరణలో కేదారి గౌరీదేవి వ్రతాన్ని వేడుకగా నిర్వహించారు. ఇంటి ఆవరణలో పెండ్యాలు వేసి, గౌరీదేవి ప్రతిమను చేసి, భక్తి శ్రద్ధలతో వ్రతాన్ని నిర్వహించారు. రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డి, ఏపీ ఇండస్ట్రీస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మాజీ ప్రతినిధి రెడ్డివారి ప్రీతమ్ రెడ్డి గ్రామస్థులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ రాజేంద్రప్రసాద్, ఈశ్వర్‌రెడ్డి, మాధవరెడ్డి, ఓంకార్ పాల్గొన్నారు.

జలకంఠేశ్వరాలయంలో..

రామచంద్రాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరాలయంలో శుక్రవారం కేదారి గౌరీవ్రతం నిర్వహించారు. ఉపాలయాల్లో వెలసిన మహాలక్ష్మి, భవానీ అమ్మవార్లకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. కలశస్థాపన అనంతరం గౌరీదేవి ప్రతిమ ఏర్పాటు చేసి, సామూహిక వ్రతం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మండలంలోని నడవలూరు, కమ్మకండ్రిగ, రామాపురం, గంగిరెడ్డి, పీవీపురం రామాలయాల్లో సామూహిక వ్రతం నిర్వహించారు.



చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో..



రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డి ఇంటి ఆవరణలో..



జలకంఠేశ్వరాలయంలో కేదారిగౌరీ వ్రతం

టపాకాయల నిప్పురవ్వలు ఎగసిపడి గడ్డివామి దగ్ధం



బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పద్మావతిపురం గ్రామంలో టపాకాయల నిప్పు రవ్వలు ఎగిసిపడి ఓ గడ్డివామి దగ్ధమైంది. శుక్రవారం దీపావళి సందర్భంగా గ్రామంలో టపాకాయలు కాల్చుతుండగా నిప్పురవ్వలు ఎగిసిపడి సమీపంలోని రమణయ్యకు చెందిన గడ్డివామిపై పడ్డాయి. మంటలు వ్యాపించాయి. శ్రీకాళహస్తి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు.అప్పటికే గడ్డి పూర్తిగా కాలిపోయింది.

వైభవంగా అమావాస్య ఉత్సవం

శ్రీకాళహస్తి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం అమావాస్య ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లు చప్పరాలపై అధిష్ఠించి పుర విహారం చేశారు. ఊరేగింపులో భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్ ఆజాద్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

వివాదాస్పద భూములపై తహసీల్దారు విచారణ



వివాదాస్పద భూములను పరిశీలిస్తున్న తహసీల్దారు, సర్పంచ్

వరదయ్యపాళెం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబూరులో మేత బీడు భూములను తహసీల్దార్ రాజశేఖర్ శుక్రవారం పరిశీలించారు. సర్వే నెం.274/4లో 21.50 ఎకరాలు, 275/2లో రెండు ఎకరాల 15 సెంట్లు, 272లో శ్మశానికి కేటాయించిన 1.54 సెంట్ల మేతభూమి ఆక్రమణకు గురైంది. దీనిపై సర్పంచ్ సాయిరెడ్డి ఆధ్వర్యంలో స్థానికులు గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఆక్రమణ భూమికి హద్దులు ఏర్పాటు చేశారు. అయితే శుక్రవారం మళ్లీ ఆ భూముల్లో వరినాట్లు వేస్తుండడంతో గ్రామస్థులు మరోసారి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన గ్రామానికి వచ్చారు. వరినాట్లను అడ్డుకున్నారు. ఈ భూముల్లో ఎలాంటి సాగుపనులు చేయరాదని హెచ్చ రించారు. అక్కడే ఉన్న గ్రామస్థులతో మాట్లాడారు. హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తామని తెలిపారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సర్వర్ మొరాయింపు

సోమవారం వరకు ఇంతే అంటున్న అధికారులు



చిత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వేచి ఉన్న కక్షిదారులు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సర్వర్ మొరాయించడంతో మంగళవారం నుంచి అన్నిరకాల సేవలకు అంతరాయం కొనసాగుతోంది. శుక్రవారం కూడా ఇదే పరిస్థితి ఉండటంతో ఎనిమిది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగలేదు. కార్యాలయాలకు వచ్చిన కక్షిదారులు వేచి ఉండి చివరకు తమ కాకపోయేసరికి విసుగ్గా వెనుదిరుగుతున్నారు. సర్వర్ మొరాయింపుతో రిజిస్ట్రేషన్లు జరగక ప్రభుత్వ ఖజానాకు రూ.లక్షల ఆదాయానికి గండిపడుతోంది. గత వైసీపీ ప్రభుత్వం సర్వర్ నిర్వహణ బాధ్యతను ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక సర్వర్ నిర్వహణపై దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో సాంకేతిక కారణాలతో అంతరాయం కల్గుతున్నట్లు అధికారులు అంటున్నారు. ఇదే పరిస్థితి సోమవారం వరకు ఉంటుందని భావిస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. రాగివైరు చోరీ



శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పొలంలో రైతు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు ధ్వంసం చేసి రాగి చోరీ చేశారు. తొట్టంబేడు మండలంలోని చోడవరం గ్రామానికి చెందిన వెంకటరమణారెడ్డి తన పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. దొంగలు గురువారం ధ్వంసం చేసి రాగివైరు చోరీ చేశారు.

డిసెంబరు 16 నుంచి ఐషర్‌లో జాతీయ సదస్సు

ఏర్పేడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐషర్ విద్యాసంస్థలో డిసెంబరు 16, 17వ తేదీలో అండర్ గ్రాడ్యుయేట్ రీసెర్చ్ ఇన్ బయోసైన్సెస్ జాతీయ సదస్సు జరగనుంది. ఈ సదస్సు బీఎస్ఎంఎస్ విద్యార్థుల బృందంచే నిర్వహిస్తారు. వ్యవసాయం, బయోమెడికల్, టెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్, సస్టైనబుల్ ఎనర్జీ, తదితర రంగాలలో ఆలోచనలు, అనుభవాలను పంచుకోవ డానికి ఇది మంచి వేదిక కానుంది. ఈ సదస్సులో పాల్గొనే విద్యార్థులు ఐషర్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఐషర్ డైరెక్టర్ శాంతను బట్టాచార్యే తెలియజేశారు.

లారీ దగ్ధం.. తప్పిన పెను ప్రమాదం



అంజేరమ్మ కనుమ వద్ద దగ్ధమవుతున్న లారీ

వడమాలపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంజేరమ్మ కనుమ వద్ద లారీ దగ్ధమైంది. గురువారం మచిలీ పట్నం నుంచి చెన్నైకి బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ అంజేరమ్మ కనుమ వద్ద వెళ్తుంతుడగా ఉన్నట్టుండి లారీ నుంచి మంటలు వచ్చాయి. లారీని రహదారి పక్కన ఆపేసి డ్రైవర్, క్లీనర్ కిందకు దిగేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు.

నేడు మంత్రి నాదెండ్ల రాక

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం తిరుపతికి రానున్నారు. సాయంత్రం 4.40 గంటలకు చింతలచెరువు వద్దనున్న టెంపుల్ టౌన్ విల్లాస్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. 5.30 గంటలకు చెన్నారెడ్డికాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వద్ద లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసి ప్రసంగిస్తారు. అనంతరం తిరుమల చేరుకుని.. ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం తిరుగు ప్రయాణమవుతారు.

బెల్టుషాపు నిర్వాహకురాలి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల నుంచి మద్యం తీసుకెళ్లి అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తున్న ఒక మహిళను శుక్రవారం తిరుపతి రూరల్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ సీఐ నరసనాయుడు కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకంకు చెందిన పార్వతి కొంత కాలంగా బెల్టు షాపు నిర్వహిస్తోంది. ప్రస్తుతం ఎక్సైజ్ సీఐ బెల్టు షాపులపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో రూరల్ సీఐ నరసనాయుడికి అందిన సమాచారం మేరకు కుంట్రపాకంలోని బెల్టుషాపుపై దాడి చేసి అక్కడ విక్రయిస్తున్న 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పార్వతిని విచారించి స్టేషన్ బెయిల్‌పై పంపారు.

ఈఎస్ఐ ఎంఎస్‌గా డాక్టర్ శ్యాంబాబు



తిరుపతి (వైద్యం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఈఎస్ఐ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ శ్యాంబాబును నియమిస్తూ ఈఎస్ఐ డైరెక్టర్ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆయన ఆస్పత్రి ఎంఎస్‌గా బాధ్యతలు స్వీకరించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

క్రీడా వేదికల అభివృద్ధికి చర్యలు



స్విమ్మింగ్‌పూల్‌ను పరిశీలిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), నవంబరు1(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస క్రీడా సముదాయంలోని క్రీడా వేదికల అభివృద్ధికి చర్యలు చేపడతామని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు వెల్లడించారు. శుక్రవారం ఉదయం ఆయన డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్‌తో కలిసి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో తనిఖీలు నిర్వహించారు. సిమ్మింగ్‌పూల్ అడుగున పాచిపట్టి ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. నీటి పంపింగ్ యంత్రాలు కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. స్నానపు గదులను మర్మమతులు చేయించాలని ఆదేశించారు. మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరీనాను పరిశీలించి పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. స్కేటింగ్ వేదిక పక్కనున్న మట్టికుప్పలను పూర్తిగా తొలగించి, చదును చేయాలన్నారు. మల్టీపర్పస్ స్పోర్ట్స్ హాల్ పనులు పునఃప్రారంభించాలన్నారు. ఇండోర్ స్టేడియం చుట్టూ వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అభివృద్ధి పనులకు అంచనాలు తయారుచేసి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్మార్ట్‌సిటీ ఇంజనీర్లు, గుత్తేదారులు, కోచ్‌లు శ్రీలక్ష్మీకరుణ, గోపి, ప్రేమ్‌నాథ్, చక్రవర్తి, వినోద్, ఇందుజ, సాయిసుమతి పాల్గొన్నారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతకు జ్ఞాపికను అందిస్తున్న కోదండపాణి

ఐరాల(కాణిపాకం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తిరుపతికి చెందిన సప్తగిరి గ్రామీణ బ్యాంకు విశ్రాంత చీఫ్ మేనేజర్ మనోహర శుక్రవారం రూ.1,00,116లను విరాళంగా అందించారు. దాతకు సూపరింటెండెంట్ కోదండపాణి దర్శన ఏర్పాట్లు చేశారు.

తెలుగు గంగ నీరు వృథా



లీకవుతున్న తెలుగు గంగ

తిరుపతి అర్బన్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మంగళం పరిధిలోని తిరుమలనగర్‌కు వెళ్లే దారిలో తెలుగుగంగ నీరు వృథా అవుతోంది. ఏడాది క్రితం భూమి లోపల పైపు పగిలిపోవడంతో నీరు నేలపాలవుతోంది. రోడ్డు పొడవునా ప్రవహిస్తూ బురదమయంగా మారుతోంది. ఈగలు, దోమలు వ్యాప్తి చెంది రాత్రిపూట స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దీనిపై సంబంధిత అధికారులకు, సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు.

దేశ సమైక్యతకు పటేల్ కృషి మరువలేనిది



సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు1 (ఆంధ్రజ్యోతి) : దేశ సమగ్రతకు, సమైక్యతకు పాటుపడిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు అన్నారు. పటేల్ జయంతిని పురస్కరించకుని శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. డీఆర్వో మాట్లాడుతూ భారతదేశం ఒకటిగా ఉండాలని పటేల్ అభిలషించారని, అందుకే ఆయన జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి జయలక్ష్మి, కలెక్టరేట్ ఏవో భారతి, అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఇంట ‘దీపం’

ఉచిత సిలిండర్లు పంపిణీ చేసిన కూటమి నేతలు

తిరుపతిలో 49వేల మందికి లబ్ధి



లబ్ధిదారులకు సిలిండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, నరసింహయాదవ్

తిరుపతి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దీపావళి కానుకగా దీపం-2పథకంలోభాగంగా కూటమి నాయకులు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. బైరాగిపట్టెడలోని రామానాయుడు కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహ యాదవ్, శాప్ చైర్మన్ రవినాయుడు, ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఊకా విజయకుమార్ తదితరులు మహిళలకు సిలిండర్లను అందజేశారు. వారు మాట్లాడుతూ మహిళా పక్షపాతిగా ఎన్డీఏ ప్రభుత్వం నిలిచిందన్నారు. తిరుపతి నియోజకవర్గంలో 49వేల మంది దీపం పథకం కింద లబ్ధిదారులుగా ఉన్నారన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, కూటమి ప్రభుత్వం వచ్చాక క్రమంగా పురోగతి చెందుతోందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం దశలువారీగా అమలు చేస్తోందన్నారు. కమిషనర్ మౌర్య, కూటమి నాయకులు శ్రీధర్ వర్మ, పులుగోరు మురళి, మహేష్ యాదవ్, రాజారెడ్డి, పాటకం వెంకటేష్, రుద్రకోటి సదాశివం, వరప్రసాద్, నైనార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పండుగపూట పేదలకు పింఛన్ కాంతులు



పింఛను అందజేస్తున్న ఆర్సీ మునికృష్ణ, నరసింహ యాదవ్

తిరుపతి, నవంబరు1(ఆంధ్రజ్యోతి) : పండుగ పూట పేదల కళ్లలో ప్రభుత్వం కాంతులు నింపింది. ఒకటో తేదైన శుక్రవారం తెల్లవారుజామున సచివాలయ సిబ్బందితో కలసి టీడీపీ, జనసేన నాయకులు ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. రూ.4వేలు, రూ.6వేలు, రూ.10వేలు చొప్పున వివిధ రకాల సామాజిక పెన్షన్లను అందజేశారు. 35, 34, 48, 49, 31 డివిజన్లలో టీడీపీ నేతలు నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, అన్నా అనిత, కుమారమ్మ, మనోహరాచారి, యశ్వంత్ రెడ్డి, రాజయ్య, ఎస్వీఎం శ్రీధర్, జగన్నాథం, వెంకటేష్, దేవి తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో అట్టహాసంగా నరక చతుర్దశి

ప్రత్యేక ఆకర్షణగా టపాసుల నరకాసురుడి దహనం



తిరుపతిరూరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం రాత్రి నరక చతుర్దశి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకల్లో 52 రకాలతో కూడిన లక్షా 72వేల టపాసులతో తయారు చేసిన నరకాసురుని ప్రతిమ దహన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని అభివర్ణించారు. కాగా, చెవిరెడ్డి ఇంటివద్ద ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. వాహనాలను ప్రత్యేకంగా అలంకరించి, పూజ చేశారు.

ఘంటసాలకు ఘన నివాళి



ఘంటసాల విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న గోపీనాథ్‌రెడ్డి

తిరుపతి అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాయకుడు ఘంటసాలకు శుక్రవారం ఘన నివాళి అర్పించారు. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినెలా మొదటి శుక్రవారం భవానీనగర్ కూడలిలో ఉన్న ఘంటసాల విగ్రహానికి పుష్పాంజలి ఘటించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా విగ్రహానికి పాలాభిషేకం చేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఘంటసాల అభిమానులు కొట్టె సుబ్రహ్మణ్యం రెడ్డి, వెంకటాచలం, తిరుమలయ్య, తొండమనాడు సుబ్రహ్మణ్యంరెడ్డి, వాసు, సురేష్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

డీవైఈఈల బదిలీ

తిరుపతి(ఆటోనగర్)నవంబరు1(ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్ డివిజన్‌లో డీవైఈఈలను శుక్రవారం బదిలీ చేశారు. తిరుపతి టౌన్-1 డీవైఈఈగా ఉన్న కె.జయప్రకాష్‌ను టౌన్-3కి బదిలీ చేశారు. అక్కడ ఉన్న సతీష్‌ను కార్పొరేట్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. రేణిగుంట సబ్ డివిజన్‌లో ఉన్న అంజనేయులును తిరుపతి టౌన్-1కు, కార్పొరేట్ కార్యాలయంలోని ప్లానింగ్ విభాగంలో ఉన్న వి.రమేష్‌బాబును రేణిగుంటకు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తిరుపతి టౌన్-3లో కె.జయప్రకాష్, రేణిగుంటలో వి.రమేష్‌బాబులు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. పరిపాలన సౌలభ్యం కోసమే బదిలీలు చేశామని అధికారులు తెలిపారు.

ఘనంగా దీపావళి వేడుకలు







తాతయ్యగుంట గంగమ్మ గుడిలో వ్రతమాచరిస్తున్న మహిళలు - ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

తిరుపతి అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలో దీపావళి పండుగ ఘనంగా జరుపుకున్నారు. గురు, శుక్రవారాలు పండుగను పురస్కరించుకుని మహిళలు ఉదయాన్నే తలస్నానం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. వాహనాలను అందంగా అలంకరించి, పూజ చేశారు. నోములు ఉన్న వారు వ్రతాలు ఆచరిస్తూ అమ్మవారిని కొలిచారు. తీపి పదార్థాలను నలుగురికీ పంచిపెట్టారు. గడపల ముందు రంగవల్లులు తీర్చిదిద్దారు. మామిడాకులు, పుష్పతోరణాలు కట్టి అందంగా అలంకరించారు. సాయంత్రం ఆరు గంటల తర్వాత చిన్నాపెద్ద తేడా లేకుండా టపాకాయలు పేల్చుతూ కోలాహలంగా గడిపారు.

శాప్ చైర్మన్‌కు సన్మానం



రవినాయుడును సన్మానిస్తున్న సురేంద్రనాయుడు

తిరుపతి (జీవకోన), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శాప్ చైర్మన్‌గా నియమితులైన రవినాయుడును టీడీపీ తిరుపతి పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. రాష్ట్రంలోని ప్రతిభ ఉన్న నిరుపేద క్రీడాకారులకు చేయూతనందించే దిశగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రజక సాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి సాకల శంకర్, తెలుగు యువత నాయకులు ధనంజయ్, ఉదయ్, వాణి, జయంతి, వెంకటముని, రమేష్ పాల్గొన్నారు.

రోడ్ల వెడల్పు పార్కింగ్ కోసమా..?





భూపిరాట్టి మార్గంలో పార్కింగ్ చేసిన వాహనాలు - కందాడై రామానుజ అయ్యంగార్ మార్గంలో పార్కింగ్ చేసిన వాహనాలు

తిరుపతి (జీవకోన), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగర పరిధిలో ఇరుగ్గా ఉన్న కొన్ని రోడ్లను వెడల్పు చేసే దిశగా మున్సిపల్ కార్పొరేషన్ సంకల్పించింది. తిలక్ రోడ్‌లోని శ్రీదేవి కాంప్లెక్సు సమీపంలో గల భూపిరాట్టి, టీటీడీ ఏడీ బిల్డింగ్ పక్కన ఉన్న కందాడై రామానుజ అయ్యంగార్ మార్గాలు గతంలో చాలా ఇరుకుగా ఉండేవి. వాటిని వెడల్పు చేశారు. ఇవి వాహనదారుల కంటే పార్కింగ్ కోసం బాగా ఉపయోగపడుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాహనదారులు ఎప్పటిలాగే ఇరుకు రోడ్లలో ప్రయాణం సాగించాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ పోరాటం



పోరాటాలను వివరిస్తున్న రాధాకృష్ణ

తిరుపతి(వైద్యం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ నేతలు ప్రాణత్యాగాలకు సైతం సిద్ధంగా ఉంటారని జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ అన్నారు. మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పుట్టా మహేంద్ర ఆధ్వర్యంలో ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ వేడుకలు రుయాస్పత్రిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఏఐటీయూసీ జెండాను ఎగురవేశారు. ఆస్పత్రిలోని కార్మికులకు యూనియన్ ప్రాముఖ్యత, కార్మికుల కోసం చేసిన పోరాటాల గురించి వివరించారు. కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయీస్ రాష్ట్ర కార్యదర్శి గిరిబాబు, నేతలు లోకేష్, పురుషోత్తం, రూపాదేవి పాల్గొన్నారు.

రేపు భూమన ప్రమాణస్వీకారం

తిరుపతిరూరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా భూమన కరుణాకరరెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఇందుకోసం తిరుపతి రూరల్ మండలంలో 150 జాతీయ రహదారిని అనుకుని సదరన్ స్పైస్ హోటల్‌కి సమీపంలో బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో కలిసి భూమన ఏర్పాట్లను పరిశీలించారు.

కరుణాకర్‌రెడ్డికి సన్మానం



తిరుపతి (జీవకోన): చిత్తూరు, తిరుపతి జిల్లాల వైసీపీ అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని తిరుపతి ఎంపీ గురుమూర్తి శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైసీపీ నాయకులు సత్యనారాయణ, వేణు పాల్గొన్నారు.

నిర్వహణ లోపం

డివైడర్ల మధ్యలో ఏపుగా పెరిగిన మొక్కలు

వాహనదారులకు అవస్థలు



లీలామహల్-కరకంబాడీ రోడ్డులోని సుబ్బారెడ్డి నగర్ వద్ద ఏపుగా పెరిగిన మొక్కలు - డివైడర్ మధ్యలో ఏపుగా పెరిగిన మొక్కలు - డివైడర్ మధ్య పిచ్చి మొక్కలు

తిరుపతి (జీవకోన), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని లీలామహల్ కరకంబాడి రోడ్డులో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ పనుల్లో భాగంగా 2017-18 ప్రాంతంలో డివైడర్లను ఏర్పాటు చేశారు. అందులో అందమైన పూల మొక్కలను నాటారు. మొక్కలు ఏపుగా పెరిగి పూలు పూయడంతో ఈ రోడ్డు చూడటానికి కనువిందుగా ఉంది. అయితే వీటి నిర్వహణను గాలికి వదిలేయడంతో మొక్కలు రోడ్లపైకి వ్యాపించి వాహనదారులకు ఇబ్బందికరంగా మారాయి. రాత్రి సమయాల్లో ఏమరుపాటుగా వెళితే కళ్లకు తగిలే ప్రమాదం లేకపోలేదు. అధికారులు దృష్టి సారించి మొక్కలను కత్తిరించి, పిచ్చి మొక్కలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మంగళంలో అధ్వానంగా పారిశుధ్యం



ఇంటిచెత్తను కాలువలో పడేస్తున్న మహిళ



తిరుమలనగర్ మార్గంలో చెత్త నిల్వ

తిరుపతి అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి శివారు ప్రాంతమైన మంగళం క్వార్టర్స్, తిరుమలనగర్‌లో పారిశుధ్యం అధ్వానంగా ఉంటోంది. ఏ వీధిలో చూసినా వ్యర్థాలు కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. స్థానికులు పారిశుధ్య కార్మికులు వీధిలోకి వచ్చినప్పుడు చెత్త అందించకుండా ఖాళీ జాగాలలో పడేస్తున్నారు. కుక్కలు, పందులు వాటిని లాక్కొచ్చి వీధుల్లో పడేస్తున్నాయి. తద్వారా వీధులు అపరిశుభ్రంగా మారుతున్నాయి. రోజుల తరబడి చెత్త నిల్వ ఉండడంతో ఈగలు, దోమలు పెరిగిపోతున్నాయి. కంపు భరించలేక ముక్కులు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. పారిశుధ్య కార్మికులు చెత్త తరలించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని, పలుమార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

రష్యా దేశస్తుల రాహుకేతు పూజ



జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం రష్యాకు చెందిన పది మంది భక్తులు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వీరు రూ.750 టిక్కెట్‌తో రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. ఆలయ శిల్పకళ ఎంతో అద్భుతంగా ఉందన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

శివాలయ శిథిలాలు కాపాడుకోవాలి

ఇది 400 ఏళ్ల నాటి శివాలయం. ఈ శిథిలాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అభిప్రాయపడ్డారు. చంద్రగిరి మండలం శానంబట్లలోని స్వర్ణముఖినది ఒడ్డున ఈ శివాలయ శిథిలాలున్నాయి. క్రీస్తుశకం 16-17 శతాబ్దాల నాటి ఒక పర్లాంగు పొడవు, అడుగున్నర వెడల్పు గల రాతి కోట గోడ ఆనవాళ్లు, వరదలకు నేలమట్టమైన ఆలయ శిథిలాలను శుక్రవారం ఆయన ఎస్వీయూ విశ్రాంత తెలుగుశాఖాధిపతి పేటశ్రీతో కలిసి పరిశీలించారు. చారిత్రాక ప్రాధాన్యం గల విజయనగరం కాలానికి చెందిన కోటగోడలు, ఆలయ శిథిలాలను పునరుద్ధరించి భావితరాలకు అందించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. వీరితో పాటు చరిత్ర పరిశోధకులు పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి, ప్రకాష్, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి



వెలుగుల దీపావళి













రాత్రి వేళ.. ఎప్పటిలా ఉండే లైట్లతో పాటు టపాసుల వెలుగుల్లో తిరుపతి నగరం ఎలా ఉండిందనడానికి ఈ చిత్రాలే నిదర్శనాలు. దీపావళి సందర్భంగా గురు, శుక్రవారాల్లో రాత్రి సమయాన రంగురంగుల వెలుగులతో నగరం దేదీప్యమానంగా వెలిగిపోయింది. చూపరులకు కనువిందు చేసింది. కాగా, పండుగ వేళ పల్లె పట్నం అనే తేడాలేకుండా జిల్లా అంతటా టపాసులతో మోతెక్కించారు. రాత్రివేళ శబ్దంతో పాటు వెలుగునిచ్చే టపాసులు కాల్చారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

శాస్త్రోక్తంగా కేదారి గౌరీదేవి వ్రతం



శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా కేదారి గౌరీదేవి వ్రతాన్ని నిర్వహించారు. ఆలయంలో పార్వతీదేవి అమ్మవారిని శ్రీకృష్ణదేవరాయ మండపంలో కొలువుదీర్చారు. అభిషేక పూజల అనంతరం కలశస్థాపనచేసి వ్రతం చేపట్టారు. అమ్మవారికి మంత్రపుష్పం, నైవేద్యం సమర్పించారు. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో హాజరై వ్రతం చేశారు. నోములు నోచుకుని నోముదారాలు స్వీకరించారు. ఈవో చంద్రశేఖర్ ఆజాద్, ఆలయ అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో అమ్మవారి ఆలయాల్లో, తమ ఇళ్ల వద్ద పలువురు నోములు నోచుకున్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నోములు నోచుకుంటున్న మహిళలు



బాణసంచా కాల్చే క్రమంలో

రేకు గుచ్చుకుని బాలుడి మృతి

- పలు ప్రాంతాల్లో 14 మందికి తీవ్ర గాయాలు

తిరుపతి(వైద్యం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా టపాసులు కాల్చే క్రమంలో 14 ఏళ్ల బాలుడు మృతిచెందగా, మరో 14 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పుత్తూరు మండలం గోపాలకృష్ణపురం ఎస్టీ కాలనీకి చెందిన చరణ్(14) గురువారం రాత్రి రేకుపై టపాసు పెట్టి కాల్చాడు. ఆ టపాసు ధాటికి రేకు ఎగిరిపడి బాలుడి మెడపై గుచ్చుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని రుయాస్పత్రికి తీసుకొచ్చారు. మెడ లోపలి భాగం వరకు రేకు కోసుకుపోవటాన్ని గుర్తించి వైద్యులు వెంటనే శస్త్రచికిత్స చేశారు. బాలుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అలాగే పలు ప్రాంతాల్లో టపాసులు కాల్చే క్రమంలో మరో 14 మంది గాయపడి రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, టపాసులు కాల్చే క్రమంలో జరిగే ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని రుయా అధికారులు గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు అప్రమత్తంగా ఉంటూ అత్యవసర విభాగంలో నిరంతరం ప్రత్యేక వైద్య సేవలను అందించారు.



గాయపడి, మృతిచెందిన చరణ్ - చికిత్స పొందుతున్న పలువురు బాధితులు

కళ్లలో కారం కొట్టి.. రాడ్లతో దాడి చేసి..!

- కడివేడు గ్రామంలో వ్యక్తి హత్య



వెంకటేష్ (ఫైల్ ఫొటో)

చిల్లకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం కడివేడు అరుంధతివాడలో పాత కక్షల నేపథ్యంలో గురువారం రాత్రి ఓ వ్యక్తిని దారుణంగా హతమార్చారు. స్థానికులు తెలిపిన ప్రకారం.. గోపాల్, రమణమ్మ దంపతుల కుమారుడు వెంకటేష్(35)కు, అదే ప్రాంతానికి చెందిన పొట్టేళ్ల సుబ్రహ్మణ్యం, పల్లెపాటి సాయికుమార్, సుళ్లూరు సునీల్‌తో పాత గొడవలున్నాయి. వీరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. కొంతకాలంగా హైదరాబాదులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసుకుంటున్న వెంకటేష్ దీపావళి కోసం నాలుగు రోజుల క్రితం ఇంటికి వచ్చారు. రెండు రోజుల కిందట వెంకటేష్, సుబ్రహ్మణ్యం మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో సాయికుమార్, సునీల్‌తో కలిసి సుబ్రహ్మణ్యం గురువారం రాత్రి వెంకటేష్ ఒక్కడే ఇంట్లో ఉన్న సమయంలో కళ్లలో కారం చల్లి రాడ్లతో కొట్టి హత్య చేశారు. డీఎస్పీ రమణ కుమార్, సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ సురేష్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో వెంకటేష్ మృతదేహాన్ని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పరిశీలించి వారి కుటుంబీకులకు సానుభూతిని తెలియజేశారు.

మద్యం మత్తులో తండ్రిని హతమార్చాడు

వాకాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కని పెంచిన తండ్రినే మద్యం మత్తులో ఓ కొడుకు కడతేర్చాడు. ఈ ఘటన వాకాడు మండలంలోని దుగరాజపట్నం పంచాయతీ శ్రీనివాసపురం గిరిజన కాలనీలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగబాబు తెలిపిన ప్రకారం.. తుపాకుల చిన్నరామయ్య(78), ఆయన కుమారుడు రమేష్ రోజువారీ కూలి పనులకు వెళ్లేవారు. దీపావళి పండుగ సందర్భంగా గురువారం రాత్రి తండ్రీ కొడుకులు కలసి మద్యం తాగారు. మద్యం మత్తులో వీరిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రాత్రి 9 గంటల సమయంలో మాటామాటా పెరిగి రమేష్ కర్ర తీసుకొని తండ్రి తలపై బలంగా కొట్టాడు. ఒక్కసారిగా చిన్నరామయ్య కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. తండ్రి చనిపోవడంతో రమేష్ పరారయ్యాడు. గ్రామస్థుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన చిన్నరామయ్య

ముక్కంటి ఆలయంలో జారిపడి భక్తురాలికి తీవ్రగాయాలు



గాయపడిన మమత

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో జారి పడటి మమత(40) అనే భక్తురాలు తీవ్రంగా గాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రం కామారెడ్డికి చెందిన ఈమె తిరుపతిలో నివాసం ఉంటున్నారు. గురువారం భార్యాభర్తలు ఆలయానికి రాగా.. అమ్మవారి సన్నిధి నుంచి వెలుపలకు వచ్చే సమయంలో స్వర్ణ తాపడ ఉత్సవమూర్తి వాహనల వద్ద నేలపై నూనె ఉంటంతో ఆమె జారి పడటంతో గాయపడ్డారు. శ్రీకాళహస్తిలోని ప్రైవేటు వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి వెళ్లారు.

బాలికకు యువకుడి వేధింపులు

- ఫోక్సో కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇంటర్ చదువుతున్న ఓ బాలికను వేధిస్తున్న యువకుడిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెంకటనారాయణ తెలిపారు. సత్యసాయి జిల్లా వేపమానుపేటకు చెందిన టి. శివకుమార్ రెడ్డివారిపల్లిలోని ఓ బాలికల పాఠశాలకు వాహనంలో సిలిండర్లు సరఫరా చేసేవాడు. అక్కడ చదివే బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ఆ తర్వాత బాలిక ఇంటర్ కోసం తిరుపతిలో చేరింది. అతడు తరచూ తిరుపతికి వచ్చి ఆ బాలికతో మాట్లాడేవాడు. ఈ క్రమంలో పెళ్లి ప్రపోజల్ తేగా ఆమె ఒప్పుకోలేదు. అతడు మాత్రం వేధిస్తూనే ఉన్నాడు. దీనిపై ఆమె తల్లి తండ్రులకు చెప్పడంతో బుధవారం వారు ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి శివకుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ చెప్పారు.

46 కిలోల గంజాయి స్వాధీనం

- నలుగురు తమిళనాడువాసుల అరెస్టు

తడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తడ రైల్వే స్టేషన్ వద్ద 46 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేసినట్లు సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు గురువారం ఉదయం తడ రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు నిఘా పెట్టారు. స్టేషన్ బయట నలుగురు వ్యక్తులు బ్యాగులతో అనుమానాస్పదంగా తిరగుతుండటాన్ని గమనించి అదుపులోకి తీసుకున్నారు. బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా చెన్నైలోని ఆవడికి చెందిన ఎస్.రాజరాజన్, అంబత్తూరుకు చెందిన ఎస్.తమిళమణి, చెంగల్‌పట్టు జిల్లా చేయ్యిడూరుకు చెందిన ఎస్.సారధి, కోయ్యంబత్తూరుకు చెందిన పి.రమేష్‌గా తెలిసింది. వీరు శ్రీకాకుళం నుంచి గంజాయిని తమిళనాడుకు తీసుకెళుతున్నట్లు వెల్లడించారు. నలుగురు వ్యక్తుల నుంచి 46 కిలోల గంజాయి, 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరచిన ఎస్ఐ కొండపనాయుడు, సిబ్బందిని సీఐ అభినందించారు.



పట్టుబడ్డ గంజాయి, నిందితులతో పోలీసులు



రన్ ఫర్ యూనిటీ



సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా పోలీసులు 'రన్ ఫర్ యూనిటీ (ఏక్తా యాత్ర)' నిర్వహించారు. తొలుత పటేల్ చిత్రపటానికి ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వరకు సాగింది. దేశ సమగ్రతను కాపాడిన ఉక్కు మనిషి పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్పీ సూచించారు. అనంతరం వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

శ్రీవారి సేవలో జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్



జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

తిరుమల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అలాగే కోల్‌కాతా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, హ్యూమన్ రైట్స్ కమిషనర్ జస్టిస్ జ్యోతిర్మయి భట్టాచార్య,కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి కూడా గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

లోకం శాంతిగా ఉండాలని ప్రార్థించా

తిరుమల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): లోకం శాంతిగా, సుభిక్షంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి తెలిపారు. శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానంలో పాల్గొన్న ఆయన.. మీడియాతో మాట్లాడారు. ఈనెల 18 నుంచి జనవరి 1వ తేదీ వరకు అయోధ్యలో జరిగే మహా చండియాగానికి టీటీడీ కూడా సహకరిస్తోందన్నారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతో తిరుపతి నుంచి ఆయోధ్యకు శ్రీరామ యంత్రం పంపామని గుర్తుచేశారు. శ్రీవారి గర్భాలయంలోనూ శ్రీరాములవారి ఉత్సవమూర్తి విగ్రహం ఉందన్నారు. రాములవారికి తిరుమలకు ప్రత్యేక సంబంధాలున్నాయన్నారు. ఇక, టీటీడీ నూతన బోర్డులోని సభ్యులు మంచి సేవలు అందించాలని కోరారు.







ముక్కంటి ఆలయంలో 'ఆకాశదీపం'

శ్రీకాళహస్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం ఆకాశదీపం వెలిగించారు. కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతి రోజు ఆకాశ దీపాన్ని వెలిగించడం సంప్రదాయం. ఇందులో భాగంగా ఊంజల్‌మండపం వద్ద కార్తీక దీపానికి పూజలుచేశాక స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు.



జస్టిస్ జ్యోతిర్మయి భట్టాచార్య

పుత్తూరు వార్తలు

టీడీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

పుత్తూరు అర్బన్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గంజి లోకేష్ కుటుంబానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్ బాబు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శుక్రవారం గొల్లపల్లిలోని మృతుని ఇంటికి చేరుకున్న ఆయన వారిని పరామర్శించారు. టీడీపీ నాయకురాలు గంజి మల్లీశ్వరికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రవినాయుడు, కుమార్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పాండురంగయ్య, మణి పాల్గొన్నారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజల్ సేవ



నారాయణవనం, నవంబరు1(ఆంధ్ర జ్యోతి): నారాయణవనంలో వెలసిన కళ్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల్ సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం నిత్య కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. సాయంత్రం అమ్మవారిని పట్టువస్త్రాలతో, పూలతో అలంకరించి ఊంజల సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత సిలిండర్ దీపావళి కానుక



నారాయణవనం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని మహిళలకు దీపావళి కానుకగా అందజేసినా ఘనత కూటమి ప్రభుత్వానిదేనని టీడీపీ నాయకులు భాస్కరన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉచిత సిలిండర్లను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. తహసీల్దార్ జయరాములు, ఇన్‌చార్జి ఎంపీడీవో గుణశేఖర్, టీడీపీ పట్టణ అధ్యక్షులు హరి, మాణిక్యంరెడ్డి, శివకుమార్, మురగేష్‌రెడ్డి, రాజశేఖర్, పురుషోత్తం, ఆనందరావు, జీవ, నటరాజన్, సొరకాయలు పాల్గొన్నారు.



పుత్తూరు టౌన్: టీడీపీ ప్రభుత్వంలోనే మహిళల సంక్షేమం ఉంటుందని ఏపీ స్టేట్ పద్మ శాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, టీడీపీ పుత్తూరు అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉచితంగా గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఎంపీడీవో రమేష్‌బాబు, టీపీవో నీరజ, గ్యాస్ ఏజెన్సీ డీలర్ రవికుమార్, టీడీపీ నాయకులు బాలాజీ, కరుణాయాదవ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కేదారనాథ గౌరీ వ్రతం



పుత్తూరు టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక కామాక్షి దేవి సమేత సదాశివేశ్వర ఆలయం, కాపువీధిలోని రామాలయం, వినాయక మండపం వద్ద ఉన్న ప్రత్యేక శిబిరంలో దీపావళి అమావాస్య సందర్భంగా శుక్రవారం కేదారనాథ గౌరీ వ్రతాన్ని మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నోములు నోచుకున్నారు. స్థానిక అర్చకులు ఆధ్వర్యంలో కలిసోద్వాసన, వినాయక పూజ నిర్వహించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పూలాలలతో అలంకరించారు. కేదారనాధ గౌరీ దేవి వ్రత కథ చెబుతూ, నోము దారాలు ధరించారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



పుత్తూరు అర్బన్, నవంబర్ 01(అంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరుపేద కుటుంబాలల్లో ఉచిత వంట గ్యాస్ సిలిండర్ల పంపిణీతో వెలుగులు నింపారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఉచిత వంట గ్యాస్ పథకాన్ని ప్రారంభించడం పట్ల విజయ్ బాబు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ కూడలిలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి రవినాయుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి ధనపాల్, ఎంపీటీసీ శ్రీజ బాలాజీనాయుడు, మాజీ ఎంపీటీసీ పాండురంగయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షులు విజయ్‌శేఖర్, తెలుగు మహిళా విభాగం నియోజకవర్గ కార్యదర్శి నాగరత్నం, నాయకులు విజయ్ చౌదరి, కుమార్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, మణికంఠ, రవియాదవ్, అజయ్, పోతుగుంట రవిచంద్రబాబు, శంఖునాథం, ముని, రమేష్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

కేదారేశ్వరి వ్రతంలో మాజీ మంత్రిరోజా



పుత్తూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి రోజా కేదారేశ్వరి వ్రతాన్ని శుక్రవారం తన స్వగృహంలో భర్త సెల్వమణి, కుమారుడు కృష్ణలోహిత్‌తో కలిసి ఘనంగా నిర్వహించారు. ఇంటి ముందు రంగవల్లులను తీర్చిదిద్ది ఇంటిని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. గురువారం దీపావళి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాలతో బాణా సంచాను పేల్చారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖశాంతులతో దీపావళి, కేదారేశ్వరి వ్రతాన్ని జరుపుకోవాలని ఆమె కోరారు.

వడమాలపేట: స్థానిక ఉమామహేశ్వర ఆలయంలో దీపావళి అమావాస్య సందర్భంగా శుక్రవారం కేదారనాథ గౌరీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు, శివ, సాయిల ఆధ్వర్యంలో కేదారనాధ గౌరీ దేవి వ్రత కథ చెబుతూ, నోము దారాలకు పూజలు చేయించారు.

వైభవంగా దీపావళి ఆస్థానం



వడమాలపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో దీపావళి ఆస్థానాన్ని వైభవంగా నిర్వహించారు. గురువారం దీపావళి సందర్భంగా సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం, మూలవర్లను అలంకరించారు. ఉభయ దేవేరులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారు మాడ వీధుల్లో ఊరేగారు. తర్వాత అర్చకులు వేదమంత్రాలు నడుమ దీపావళి ఆస్థానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

వైసీపీ నేత అరెస్టు

కోట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గోవిందపల్లికి చెందిన వైసీపీ నాయకుడు, మాజీ జడ్పీటీసీ ఉప్పల ప్రసాద్‌గౌడ్‌ను అరెస్టు చేసి నెల్లూరు సబ్ జైలుకు పంపినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. రెండు రోజుల క్రితం ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు మహిళలు ఉపాధి ఏపీవో పూర్ణిమ విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దాడి యత్నించారు. ఏపీవో ఫిర్యాదు మేరకు పది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రసాద్‌గౌడ్‌ను శుక్రవారం చేయగా మిగిలిన 9మంది కోసం గాలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం



పెంచలమ్మ

వెంకటగిరి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీసీ కండ్రిగ గ్రామానికి చెందిన వేలూరు రాజా భార్య పెంచలమ్మ అదృశ్యం అయిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. రాజా కథనం మేరకు... అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం అగ్రహారం గ్రామానికి చెందిన పెంచలమ్మతో ఎనిమిది నెలల క్రితం రాజాకు వివాహం జరిగింది. గురువారం దీపావళి పండగ కోసం అత్తగారి ఇంటికి వెళ్లడానికి రాజా దంపతులు బయలుదేరారు. రాపూరులో బస్సు కోసం నిరీక్షిస్తుండగా పెంచలమ్మ అదృశ్యం అయింది. బస్టాండ్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో గాలించినా కనిపించలేదు. పెంచలమ్మ తల్లిదండ్రులను ఫోన్ చేసి ఆరా తీసినా ఇంటికి రాలేదని చెప్పారు. దీంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్టాండ్‌లోని సీసీ పుటేజీ పరిశీలించగా బస్టాండ్ నుంచి బయటకు పోతున్నట్లు కనిపించింది. కాగా, ఫిర్యాదు స్వీకరించే విషయంలో రాపూరు, వెంకటగిరి పోలీసులు సాకులు చెప్పి తప్పించుకోజూడడంతో బాధితులు అసహనం వ్యక్తం చేశారు. రాపూరులో ఫిర్యాదు ఇస్తే వెంకటగిరిలో, వెంకటగిరిలో ఫిర్యాదు ఇస్తే మిస్సింగ్ అయింది రాపూరులో కాబట్టి అక్కడే ఫిర్యాదు చేయాలని చెప్పి తప్పించుకున్నారు. చివరకు యువతి తల్లిదండ్రులు రాపూరులో, రాజా వెంకటగిరిలో ఫిర్యాదు చేశారు.

హామీలన్నీ నెరవేరుస్తాం: పాశం



మహిళలకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాశం

కోట/వాకాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని, ఏ ఒక్క హామీని విస్మరించే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. కోట మండల పరిధిలోని వెంకన్నపాళెంలో శుక్రవారం మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లను అందించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. త్వరలోనే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం నాలుగు పంచాయతీల్లోని పొదుపు సంఘాలకు రూ.కోటి రుణాలకు సంబంధించి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్, టీడీపీ జిల్లా కార్యదర్శి తీగల సురేష్, బీజేపీ నేత పునబాక కోటేశ్వరరావు, చిల్లకూరు దశరధరామిరెడ్డి, మధుయాదవ్, జగన్‌మోహన్‌రెడ్డి, సురేష్, తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు, ఏపీఎం అనీల తదితరులు పాల్గొన్నారు.

● వాకాడు మండలం కొండూరులో మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, పాపారెడ్డి పురోషోత్తంరెడ్డి, చిల్లకూరు దశరధరామిరెడ్డి, కుంచం దయాకర్, దోశకాయల కృష్ణమూర్తి, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, నందగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: కురుగొండ్ల



మంచం మీదున్న వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న కురుగొండ్ల

డక్కిలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీపురం దళితవాడలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వృద్ధులు, వికలాంగులు, వితంతవులు, కిడ్నీ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్లు అందించి అండగా నిలుస్తోందన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. అధ్వానంగా ఉన్న శ్రీపురం రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో రామాలయ నిర్మాణానికి టీటీడీ ద్వారా నిధులు ఇప్పించి పూర్తి చేస్తామన్నారు. అంతకు ముందు ఆయన పలుగోడు గ్రామంలోనూ పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామంలో ఇళ్లపై వెళుతున్న విద్యుత్ లైన్లు మార్చాలని గ్రామస్తులు కోరగా వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, రంగినుని రాజా, డక్కిలి చంద్రారెడ్డి, రామూర్తి, పచ్చూరి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్‌తో బలహీన వర్గాలకు ఎంతో మేలు: కలెక్టర్ వెంకటేశ్వర్

తడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న గ్యాస్ సిలిండర్లతో బలహీన వర్గాల కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం తడ మండలం రామాపురం ఉన్నత పాఠశాల ఆవరణలో దీపం పథకం-2ను ఎమ్మెల్యే విజయశ్రీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో ల్యాండ్ టైటలింగ్ చట్టం రద్దు, పింఛన్ల పెంపు ఇప్పటికే అమలు చేస్తుండగా ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లను దీపావళి కానుకగా అందిస్తున్నట్లు తెలిపారు. త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడనుందని చెప్పారు. అలాగే మత్స్యకారుల చిరకాల కోర్కెైన పులికాట్ పూడికతీతకు సాగరమాల పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి ఏడాదిన్నరలోపు పులికాట్ జలకళ సంతరించుకునేలా చేస్తామన్నారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పేదలకు పట్టెడన్నం పెట్టే అన్న క్యాంటీన్లను మూసేసి బడుగల కడుపుకొట్టిందన్నారు. టీడీపీ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా సిమెంటు రోడ్ల నిర్మాణం కోసం సూళ్లూరుపేట నియోజకవర్గానికి రూ.12 కోట్లను కేటాయించారని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఇరకంలో ఏఎన్ఎం నియమించాలని, తడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో మద్యం షాపును మరోచోటుకు తరలించాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో విజయకుమార్, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ నాయకులు మురళీరెడ్డి, సుధాకర్‌రెడ్డి, బొమ్మన శ్రీధర్, నీలకంఠం, సెల్వం, పళణి, బీజేపీ నాయకులు ఆదినారాయణరెడ్డి, కృష్ణమూర్తి, సర్పంచు టీకే.శ్రీనివాసన్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మేరిగ ఆరోపణలు అసత్యం: టీడీపీ



సమావేశంలో టీడీపీ నాయకులు

గూడూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌పై వైసీపీ ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అసత్య ఆరోపణలు చేయడం తగదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం కోట గ్రామంలో వైసీపీ ఎమ్మెల్సీ మేరిగ మురళి నిర్వహించిన సమావేశంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రౌడీయిజం పెరిగిపోయిందని, ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేయడం మంచిపద్ధతి కాదన్నారు. మహిళా ప్రభుత్వ ఉద్యోగినిపై వైసీపీ నాయకులు దౌర్జన్యం చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ విషయాన్ని గుర్తించకుండా ఎమ్మెల్సీ మాట్లాడడం సమంజసం కాదన్నారు. పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురాజు, ఇశ్రాయిల్ కుమార్, రవీంద్రరెడ్డి, పెంచలయ్య, సునీల్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఐదు లక్షల ఆర్థికసాయం

చిల్లకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాంచారమ్మపేట గ్రామంలో హత్యకు గురై మృతిచెందిన టీడీపీ కార్యకర్త హరిప్రసాద్ కుటుంబసభ్యులకు శుక్రవారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, పెంచలకోన ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ రూ.5లక్షల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ దృష్టికి తీసుకువెళ్లి హరిప్రసాద్ కుటుంబానికి మరింత సాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, పూడిపర్తి ప్రవీణ్ కుమార్ రెడ్డి, పెజ్జాయి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తుకు భరోసా: కురుగొండ్ల



గ్యాస్ సిలిండరు అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

బాలాయపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ముందు చూపుతో ఆలోచించే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసేందుకు ముఖ్యమంత్రి ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. మన బిడ్డల భవిష్యత్తు బాగుండాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా మన్నూరు గ్రామస్తులు తమ గ్రామంలోని ప్రభుత్వ భూములను బయట ప్రాంతాలకు చెందిన వారికి అమ్మేస్తున్నారని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. తక్షణమే ఆక్రమణలు తొలగించాలని తహసీల్దార్‌కు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో సర్పంచు దట్టం అంజలి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో వినీల్ కుమార్, డీటీ శిరీష, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి, రాయి సత్యం నాయుడు, కొర్రపాటి రామచంద్రనాయుడు, దాసరి రాజగోపాల్ నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు, మద్దూరు కృష్ణ, ముప్పాళ్ల మాధవ నాయుడు, ఆది వెంకటకృష్ణారెడ్డి, తాళ్లూరు ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నేరవేరుస్తుంది: పాశం



పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చడం జరుగుతుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం గూడూరు పట్టనంలోని 1వ వార్డులో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీన నేరుగా లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛను అందిస్తున్నామన్నారు. మహిళలకు ఏడాదికి ఉచితంగా అందించే గ్యాస్ సిలిండర్ల పథకాన్ని దీపావళి సందర్భంగా ప్రారంబిస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదన్నారు. నిరుపేదలకు నివాస స్థలం కేటాయించడంతో పాటు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఇల్లు నిర్మించుకునేందుకు రూ.4లక్షలు ఆర్థికసాయం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు గోను శివకుమార్, గురవయ్య, కోటేశ్వరరావు, శివ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ఏఆరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఉపాధ్యాయులు ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌ను కలిసి కందలి గ్రామంలోని పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సిద్దయ్యకు అనారోగ్యంగా ఉండడంతో సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి సాయం అందించాలని కోరారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందించేలా చర్యలు తీసుకోవడంతో పాటు తనవంతుగా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్ష అందజేస్తానని ఎమ్మెల్యే చెప్పడంతో ఉపాధ్యాయులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా గురువారం స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో దీపావళి సందర్భంగా రెడ్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు దుస్తులు, టపాసులు పంపిణీ చేశారు. దివ్యాంగులకు చేయూతనిచ్చేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రెడ్ సంస్థకు ఎమ్మెల్యే తనవంతు సాయంగా రూ.లక్ష అందజేశారు. అదేవిధంగా స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో టీడీపీ పట్టణ కమిటీ కార్యదర్శి అమరయ్య నాయుడు పుట్టినరోజు నిర్వహించి వృద్ధులకు అన్నదానం చేశారు.

దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ పథకం



గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్న టీడీపీ నేతలు

గూడూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా దీపావళి కానుకగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకాన్ని ప్రారంభించినట్లు తిరుపతి పార్లమెంటు టీడీపీ రైతుకమిటీ కార్యదర్శి దుద్దా రాఘవరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తిప్పవరప్పాడు గ్రామంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా మహిళలు గ్యాస్ కోసం చెల్లించే రూ. 840 నగదు 48 గంటల్లోగా తిరిగి వారి ఖాతాల్లో జమకావడం జరుగుతుందన్నారు. ఇచ్చిన హామీలను నేరవేర్చే సమర్థత సీఎం చంద్రబాబునాయుడుకే ఉందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లురాజు, తిరుపతి మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి, శ్రీనివాసులురెడ్డి, తహసీల్దారు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో లారీ డ్రైవర్ బీభత్సం

● వెంబడించి పట్టుకున్న యువకులు



మద్యం మత్తులో లారీ డ్రైవర్

రేణిగుంట, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో లారీ నడుపుతూ ఓ డ్రైవర్ రోడ్డుపై బీభత్సం సృష్టించాడు. ఆగ్రహించిన యువకులు వెంబడించి లారీ డ్రైవర్‌ను పట్టుకున్నారు. స్థానికుల కథనం మేరకు.. పశుపతి ట్రాన్స్‌పోర్టుకు చెందిన ఓ డ్రైవర్ మినీలారీ తో రేణిగుంట వైపు బయలుదేరాడు. నారాయణాద్రి ఆస్పత్రి నుంచి విపరీతమైన వేగంతో డివైడర్లను రాసుకుంటూ, స్పీడ్ బ్రేకర్ల వద్ద నెమ్మదించకుండా ఇష్టం వచ్చినట్లు రోడ్డుకు అటుఇటు తిప్పుతూ నడపడంతో ముందు, వెనుక వెళుతున్న వాహనదారులు భయంతో తమ వాహనాలను రోడ్డు పక్కన ఆపేశారు. వెనుక వస్తున్న కొంతమంది వాహనదారులు లారీని ఓవర్ టేక్ చేసి ముందుపోతున్న వాహనదారులను అప్రమత్తం చేశారు. రేణిగుంట అంబేడ్కర్ కూడలి వద్ద అతికష్టం మీద ఆ లారీని ఆపారు. వాహన డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గూడూరు అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన గూడూరు మండలంలోని నెల్లటూరు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులను శుక్రవారం ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్ఎం రామయ్య మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న సాకేత్‌కుమార్, గురుఅర్జున్ ఇటీవల నెల్లూరులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి యోగా పోటీల్లో ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. శనివారం నుంచి నెల్లూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీడీ విజయ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

వరదయ్యపాలెం, నవంబరు 1: తమ గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని రాచకండ్రిగ గ్రామస్తులు రోడ్డెక్కారు. శ్రీకాళహస్తి -తడ రహదారిపై బైఠాయించి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోఓల్టేజీ కారణంగా విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పోవడంతో టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు కాలిపోతు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు విద్యుత్ అధి కారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. అలాగే డ్రైనేజీ కాలువలు నిర్మించాలని కోరారు. శ్రీసిటీ ఎస్ఐ హరిప్రసాద్ అక్కడికి చేరుకుని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, చెల్లయ్య, వేణు, షణ్ముగం, రమణయ్య, వెంకటరమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



వడమాలపేట, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జడ్పీటీసీ సభ్యులు మురళీరెడ్డి చెప్పారు. శుక్రవారం మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలెండర్లును అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జరీనా, నాయకులు ధనంజయులు నాయుడు, జానా వెంకటయ్య, ఉమాపతి రావ్, మునిశేఖర్, శేషాద్రి యాదవ్, హేమావతి, గురునాథం శెట్టి, శివరాయల్, ఉమాపతి, గరుడ భారత్ గ్యాస్ డీలర్ నాగేశ్వరరావ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీల వద్ద రద్దీ

గూడూరు అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా ఏడాదికి ఉచిత మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. దీంతో కొంతమంది వినియోగదారుల ఫోన్‌లకు మేసేజ్‌లు వచ్చాయి. మేసేజ్‌లు రాని తెల్లరేషన్ కార్డుదారులు తమ పేర్లు అర్హుల జాబితాలో ఉన్నాయా లేదా అని తెలుసుకునేందుకు శుక్రవారం స్థానిక గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులుతీరారు.

వైభవంగా అమావాస్య ఉత్సవం


ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం అమావాస్య ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అలం కార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లు చప్పరాలపై అధిష్ఠించి పుర విహారం చేశారు. ఊరేగింపులో భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్ ఆజాద్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ..ఎనిమిది మందికి గాయాలు


గాయపడిన రమేష్, భానుచంద్ర

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల ఘర్షణలో ఎనిమిది మంది గాయపడ్డారు. ఈ ఘటన తొట్టంబేడు మండలం పెద్దకనపర్తి దళితవాడలో చోటు చేసుకుంది. పెద్దకనపర్తి దళితవాడకు చెందిన రమేష్, దూరపు బంధువులు. వీరి కుటుంబాల మధ్య కొంతకాలంగా విబేధాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఇరువురి మధ్య గురువారం వాగ్వాదం చోటు చేసుకుంది. ఘర్షణగా మారింది. ఒకరిపై ఒకరు దాడులకు దిగడంతో ఎనిమిది మంది గాయపడ్డారు. ఇందులో రమేష్, భానుచంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరారు. తొట్టంబేడు పోలీసులు కేసు నమోదు చేస దర్యాప్తు చేపట్టారు.

గుర్తుతెలియని యువకుడికి తీవ్రగాయాలు



శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు (35)తీవ్రంగా గాయపడ్డాడు. తొట్టంబేడు మంలం బీడీ కాలనీ వద్ద చెన్నై రహదారిపై గురువారం సాయంత్రం గుర్తుతెలియని యువకుడి ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. అతడు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళుతున్న ఓ యువకుడు గుర్తించి అతడిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తరలించారు.

ద్విచక్ర వాహనం బోల్తా..ఇద్దరికి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన శ్రీకాళహస్తి శివారులోని బంగారమ్మ కాలనీ వద్ద గురువారం చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి పట్టణం భాస్కరపేటకు చెందిన ఇద్దరు యువకులు బంగారమ్మ కాలనీ వద్ద రాజీవ్‌నగర్‌వైపు వెళుతుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి గాయపడ్డారు. స్థానికులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

టపాకాయల నిప్పురవ్వలు ఎగసిపడి గడ్డివామి దగ్ధం



బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పద్మావతి పురం గ్రామంలో టపాకాయల నిప్పు రవ్వలు ఎగిసిపడి ఓ గడ్డివామి దగ్ధమైంది. శుక్రవారం దీపావళి సందర్భంగా గ్రామంలో టపాకాయలు కాల్చుతుండగా నిప్పురవ్వలు ఎగిసిపడి సమీపంలోని రమణయ్యకు చెందిన గడ్డివామిపై పడ్డాయి. మంటలు వ్యాపించాయి. శ్రీకాహస్తి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అర్పారు.అప్పటికే గడ్డి పూర్తిగా కాలిపోయింది.

తెలుగుగంగ కాలువలో తేలిన మృతదేహం

కేవీబీపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవనూరు వద్ద ప్రహిస్తున్న తెలుగుగంగ కాలువలో శుక్రవారం ఉదయం ఓ మృతదేహం కొట్టుకువచ్చింది. స్థానికుల సమాచారంతో పిచ్చాటూరు ఎస్‌ఐ వెంకటేశులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహన్ని వెలికి తీయించారు. మృతుడు తొట్టంబేడు మండలంలో చిన్నసింగమాలకు చెందిన వెంకటసుబ్బయ్య (48)గా గుర్తించారు. ఎస్‌ఐ కథనం మేరకు.. వెంకటసుబ్బయ్య 30వ తేదీ ఉదయం బహిర్భూమికి అని తన ఇంటి సమీపంలోని తెలుగుగంగ కాలువ వద్దకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయాడు. మృతదేహన్ని పోసుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. హెడ్‌కానిస్టేబుల్ అమర్‌నాథ్‌నాయుడు, విశ్వనాథ్, దయాకర్, బుజ్జి పాల్గొన్నారు.

అపోలో అధినేత పట్టువస్త్రాల వితరణ



శ్రీకాళహస్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారికి గురువారం దీపావళిని పురస్కరించుకుని అపోలో గ్రూప్స్ అధినేత డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి పట్టువస్త్రాలను సమర్పించారు. వీటిని ఆయన తరఫున పాలకమండలి మాజీ సభ్యురాలు డాక్టర్ ప్రమీలమ్మ అందజేశారు. ఈవో చంద్రశేఖర్ ఆజాద్ వీటిని స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

చెప్పింది అమలు చేసేదే టీడీపీ ప్రభుత్వం


గ్యాస్ పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

కేవీబీపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): చెప్పిందే అమలు చేసేదే తెలుగుదేశం పార్టీ అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామాంజుల నాయుడు చెప్పారు. శుక్ర వారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద దీపం కనెక్షన్ గ్యాస్ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో రాధారాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. బుక్ చేసుకున్నవారికి ఉచితంగా గ్యాస్ సిలిండర్‌ను అందజేశారు. ఈ కార్య క్రమంలో ఇన్‌ఛార్జి తహసీల్దారు మునిరత్నంరెడ్డి, మండల నాయకులు రైతు అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్, జడ్పీటీసీ మునెమ్మ తదితర టీడీపీ నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.

లారీ దగ్ధం.. తప్పిన ప్రమాదం



వడమాల పేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంజేరమ్మ కనుమ వద్ద లారీ దగ్ధమైంది. గురువారం మచిలీ పట్నం నుంచి చెన్నైకి బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ అంజేరమ్మ కనుమ వద్ద వెళ్తుండగా ఉన్నట్టుండి లారీ నుంచి మంటలు వచ్చాయి. లారీని రహదారి పక్కన ఆపేసి డ్రైవర్, క్లీనర్ కిందకు దిగేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. రాగివైరు చోరీ



శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పొలంలో రైతు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు ధ్వంసం చేసి రాగి చోరీ చేశారు. తొట్టంబేడు మండలంలోని చోడవరం గ్రామానికి చెందిన వెంకటరమణారెడ్డి తన పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. దొంగలు గురువారం ధ్వంసం చేసి రాగివైరు చోరీ చేశారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

భక్తులకు అన్నదానం



శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీవీరోడ్డులో వెలసిన అంకాలమ్మ ఆలయం వద్ద గురువారం అమావాస్యను పురస్కరిం చుకుని నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్‌రావు, యశ్వంత్‌రావు, క్రాంతికుమార్, శివకుమార్‌రెడ్డి, డాక్టర్ కృపానిధి, ఉపేందర్‌రెడ్డి, రాఘవేంద్ర, సావిత్రిబాయి, మాధవ, సాయి, సుశీల, బాబు, వినీత్‌రెడ్డి, నాగేష్, రాజేశ్వరరావు, వినోద్‌కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద గురువారం డొక్క సీతమ్మ స్ఫూర్తితో జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి కోట వినుత ఆధ్వర్యంలో సుమారు 400 మందికి పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పేట చంద్రశేఖర్, చిరంజీవి, కావలి శివకుమార్, తోట గణేష్, జ్యోతిరామ్, రవికుమార్‌రెడ్డి, దినేష్, సురేష్, మణి, శారద, గాయత్రి పాల్గొన్నారు.

అంబరం దీపావళి సంబరం



శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో గురువారం దీపావళి పండుగ సంబరం అంబరాన్ని తాకింది. పిల్లలు, పెద్దలు ఎంతో ఉత్సాహంగా టపాసులు పేల్చారు. ప్రతి ఇంటా సాయంత్రం దీపాలు వెలిగించారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రముఖ ఆలయాల్లో కేదారీగౌరీ వ్రతాన్ని చేసుకున్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ


ప్రిన్సిపాల్ నరసింహవర్మ

శ్రీకాళహస్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కెనర సింహవర్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా ఉన్న శ్రీలత ఉద్యోగ విరమణ చేయడంతో ఆమె స్థానంలో నరసింహవర్మ బాధ్యతలు చేప ట్టారు. ఈయన ఈ కళాశాల పూర్వవిద్యార్థి కావడం గమనార్హం. ఇదే కళాశాలలో జువాలజీ అధ్యాపకులుగా, వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. పలువురు అధ్యాపకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ఏర్పేడు, నవంబరు (ఆంధ్రజ్యోతి): ఏర్పేడులో శనివారం ప్రజాసమస్యల పరి ష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని ఎంపీడీవో సౌభాగ్యం తెలియజేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పాల్గొననున్నారని వెల్లడించారు. ప్రజలు వినతిపత్రాలు అందించవచ్చని తెలియజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దీపం ఓ వరం: సుధీర్‌రెడ్డి


సిలిండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దీపం పథకం లబ్ధిదారులకు ఓ వరమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని భారత్ గ్యాస్ వద్ద ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేశారన్నారు. దీనిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, టీడీపీ నాయకులు విజయకుమార్‌నాయుడు, గాలి చలపతినాయుడు, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాడైనా..నేడైనా చంద్రబాబుతోనే దీపం వెలుగు


సిలిండర్లను పంపిణీ చేస్తున్న ఆదిమూలం

పిచ్చాటూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నాడు కట్టెల పొయ్యిపై వంట చేసే మహిళలు నేడు గ్యాస్ స్టవ్‌పై వంట చేస్తున్నారంటే మహిళల జీవితాల్లోకి అది చంద్రబాబు తీసు కొచ్చిన వెలుగేనని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలియజేశారు. శుక్రవారం పిచ్చాటూరు సచివాలయం వద్ద ఉచిత గ్యాస్ సిలండర్లను ఆయన పంపిణీ చేరు. అంతకు ముందు టీడీపీ కార్యాలయంలో అభివృద్ధి పనులపై సమీక్షించారు. తర్వాత నాగలాపురంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు రాజ మాణిక్యం ఇంటికెళ్లి ఆయన్ను పరామర్శించారు. అదేవిధంగా నాగలాపురం మండలం బీరకుప్పం గ్రామంలో మృతిచెందిన టీడీపీ నేత మురుగన్ ఇంటికెళ్లారు. ఆయన కుటుం బసభ్యులను పరామర్శించారు. ఏఎంసీ మాజీ చైర్మన్, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీవో రఫీ, ఏపీఎం చంద్రకళ, సీసీలు శశి సుబ్రహ్మణ్యం, నాగేంద్రబాబు, టీడీపీ నాయకులు పద్దురాజు, టౌన్ ప్రెసిడెంట్ వాసు, నాగలాపురం నాయకులు ఎంపీటీసీ సెల్వకుమార్, మాజీ ఎంపీపీ మురళి, సురేష్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు


చికిత్స పొందుతున్న ధనుష్

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 1 (ఆంధ్ర జ్యోతి) : మండలంలో మూడు చోట్ల జరిగిన వేర్వరు ప్రమాదాల్లో నలుగురు గాయాల పాలయ్యారు. ●బీఎన్‌కండ్రిగ గ్రామానికి చెందిన శివకుమార్, హేమకుమార్‌లు శ్రీకాళ హస్తి నుంచి ద్విచక్రవానంపై ఇంటికి వస్తుండగా విజయ గోపాలపురం గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో గాయపడ్డారు. ● కర్నూలుకు చెందిన ధనుష్ కాటూరుకు గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. శ్రీకాళహస్తికి ద్విచక్ర వాహనంలో వెళ్లి తిరిగి కాటూరుకు వస్తుండగా చెన్నై నుంచి శ్రీకాళహస్తికి వెళుతున్న కంటైనర్ ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. ● పీవీకండ్రిగ గ్రామానికి చెందిన నారాయణ ద్విచక్ర వాహనంపై గ్రామానికి వెళుతుండగా అదుపు తప్పి పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు తెలిపారు.

ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ



బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎస్‌బీఐ దగ్గర వద్ద మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను తహసీల్దార్ సుబ్రమణ్యం, మండల టీడీపీ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబు నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కన్నయ్య నాయుడు నాయకులు సుందరయ్య, రవినాయుడు, మధు నాయుడు, పెంచులయ్య, రమేష్‌బాబు, వెంకటాచలం, మునెయ్యనాయుడు, కార్తీక్ నాయుడు, ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూములపై తహసీల్దారు విచారణ


వివాదాస్పద భూములను పరిశీలిస్తున్న తహసీల్దారు, సర్పంచ్

వరదయ్యపాళెం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబూరులో మేత బీడు భూములను తహసీల్దార్ రాజశేఖర్ శుక్రవారం పరిశీలించారు. సర్వే నెం.274/4లో 21.50 ఎకరాలు, 275/2లో రెండు ఎకరాల 15 సెంట్లు, 272లో శ్మశానికి కేటాయించిన 1.54 సెంట్ల మేతభూమి ఆక్రమణకు గురైంది. దీనిపై సర్పంచ్ సాయిరెడ్డి ఆధ్వర్యంలో స్థానికులు గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఆక్రమణ భూమికి హద్దులు ఏర్పాటు చేశారు. అయితే శుక్రవారం మళ్లీ ఆ భూముల్లో వరినాట్లు వేస్తుండడంతో గ్రామస్తులు మరోసారి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన గ్రామానికి వచ్చారు. వరినాట్లను అడ్డుకున్నారు. ఈ భూముల్లో ఎలాంటి సాగుపనులు చేయరాదని హెచ్చ రించారు. అక్కడే ఉన్న గ్రామస్తులతో మాట్లాడారు. హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తామని తెలిపారు.

బాబాయిపై దాడి

శ్రీకాళహస్తి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో యువకుడు బాబాయిపై దాడి చేశాడు. ఈ ఘటన తొట్టంబేడు మండలం కాసరంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుని కథనం మేరకు.. కాసరానికి చెందిన గురవయ్య(56) రైతు. ఈయన అన్న కుమారుడు హనుమంతు మద్యం సేవిస్తూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తుండటంపై మందలించేవాడు. ఈ క్రమంలో శుక్రవారం పూటుగా మద్యం సేవించిన హనుమంతును మళ్లీ ఆయన నిలదీశాడు. కాసేపటి తరువాత ఇంటి వద్ద నిద్రిస్తున్న బాబాయిపై హనుమంతు పిడి గుద్దులతో దాడి చేశాడు. గాయపడిన ఆయన్ను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కంటి నుంచి రక్తస్రావం అవుతుండటంతో తిరుపతికి తరలించారు.

మహిళా సాధికారతకు పెద్దపీట


సిలిండర్ పంపిణీ చేస్తున్న శ్రీపతిబాబు

సత్యవేడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ కో-ఆర్డినేటర్ శ్రీపతి బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో మహిళలకు గ్యాస్ సిలెండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి, ఏపీఎం డాంగే యాదవ్, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ సురేష్, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రేణిగుంట: కూటమి ప్రభుత్వం ఇచ్చిన



హామీల్లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్లను దీపావళిని పురస్కరించుకుని శుక్రవారం కూటమి నాయకులు హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఏర్పేడు: ఏర్పేడు హెచ్‌పీ గ్యాస్ వద్ద



మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొన్నా రావు, ధనంజయులనాయుడు, గుర వారెడ్డి, శివశంకర్‌రెడ్డి, కృష్ణవేణి, నాగరాజు నాయుడు, గుణయాదవ్, సుబ్రహ్మణ్యం, రవి నాయుడు, నిరంజన్‌బాబు, కేకేరమణ, రాచేటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: వరదయ్యపాళెంలో



దీపం పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దారు రాజశేఖర్, టీడీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, నిర్మల్, నాగరాజు యాదవ్, జయచంద్రనాయుడు, శ్రీనునాయుడు, గుత్త త్యాగరాజు, గ్యాస్ అధినేత వెంకటేస్, జనసేన నాయకులు తడ శ్రీను, మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

డిసెంబరు 16 నుంచి ఐషర్‌లో జాతీయ సదస్సు

ఏర్పేడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐషర్ విద్యాసంస్థలో డిసెంబరు 16, 17వ తేదీలో అండర్ గ్రాడ్యుయేట్ రీసెర్చ్ ఇన్ బయోసైన్సెస్ జాతీయ సదస్సు జరగనుంది. ఈ సదస్సు బీఎస్ఎంఎస్ విద్యార్థుల బృందంచే నిర్వహిస్తారు. వ్యవసాయం, బయోమెడికల్, టెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్, సస్టైనబుల్ ఎనర్జీ, తదితర రంగాలలో ఆలోచనలు, అనుభవాలను పంచుకోవ డానికి ఇది మంచి వేదిక కానుంది. ఈ సదస్సులో పాల్గొనే విద్యార్థులు ఐషర్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఐషర్ డైరెక్టర్ శాంతను బట్టాచార్యే తెలియజేశారు.

రాష్ట్ర సరిహద్దులో కలకలం

- తమిళనాడు యువకుడికి పోస్టుమార్టం
- హత్యచేసిన వీడియోను షేర్‌చేసి దొరికిపోయిన హంతకులు

సత్యవేడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులోని సత్యవేడు మండలం చెన్నేరిలో తమిళనాడుకు చెందిన ఓ యువకుడిని హత్యచేసి పూడ్చి పెట్టిన ఘటన కలకలం రేగింది. రెండు నెలల అనంతరం ఆలస్యంగా వెలుగు చూసిన ఈ హత్యోదంతంతో రెండు రాష్ట్రాల్లోని సరిహద్దు ప్రాంతాలు ఉలిక్కి పడ్డాయి. వివరాలిలా ఉన్నాయి... రాష్ట్ర సరిహద్దులోని తమిళనాడు రాష్ట్రం ఊత్తుకోట్టైకు చెందిన ధనశేఖర్ కుమారుడు దినేష్ (20) ఈ ఏడాది ఆగస్టు 20వ తేదీన అదృశ్యమయ్యాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఊత్తుకోట్టై పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. రెండు నెలల నుంచి విచారణ చేస్తున్న ఊత్తుకోట్టై పోలీసులు సూళ్లూరుపేటకు చెందిన నాగేష్(21), ఊత్తుకోట్టైకు చెందిన కార్తీక్ (22)తో పాటు ముగ్గురు అనుమానితులను అదుపులో తీసుకుని విచారించగా దినేష్‌ను హతమార్చి ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో పూడ్చిపెట్టినట్లు తేలింది. దీంతో తిరువళ్లూరు డీఎస్పీ శాంతి ఆదేశాల మేరకు ఊత్తుకోట్టై సీఐ దేవరాజ్ ఆధ్వర్యంలో మృతదేహన్ని పూడ్చి పెట్టిన ప్రాంతాన్ని గుర్తించి వెలికి తీసేందుకు సత్యవేడు సీఐ మురళీని సంప్రదించారు. ఈ క్రమంలో సత్యవేడు తహసీల్దార్ సుబ్ర మణ్యం, ఎస్‌ఐ రామస్వామి సమక్షంలో తమిళనాడు పోలీసులు గురువారం చెన్నేరి వద్ద మృతదేహన్ని పూడ్చి పెట్టిన ప్రాంతాన్ని గుర్తించి, శవాన్ని వెలికి తీశారు. ఇరు రాష్ట్రాలకు చెందిన పోలీసు, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో తమిళనాడుకు చెందిన వైద్య బృందంతో మృతదేహనికి పోస్టు మార్టం నిర్వహించి మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కేసులో మరో ప్రధాన నిందితుడైన కామేష్ (25) ఇప్పటికే వేరే కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్నట్లు తెలిసింది. కాగా ఈ నలుగురు యువకులు గంజాయి, మద్యం సేవించి మత్తులో ఈ హత్య చేసినట్లు సమాచారం. నిందితులు హత్యను వీడియో తీసి మద్యం మత్తులో ఇతర స్నేహితులకు చూపించడంతో విషయం బయటకు పొక్కింది.


మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న అధికారులు